తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ల ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026

## తిరుచ్చి వాహనంపై 'దేవేరులతో శ్రీకృష్ణుడు'



చంద్రగిరి, మార్చి 24 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆల యంలో మంగళవారం రోహిణి నక్ష త్రాన్ని పురస్కరించుకుని రుక్మిణీ సత్య భామ సమేత శ్రీకృష్ణుడు బంగారు తిరు చ్చిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామి వారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం రుక్మిణీ సత్య భామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు

### రామనామస్మరణతో కదలిన

## కోదండరాముడి రథోత్సవం

తిరుపతి, మార్చి 24ప్రభాతవార్త:



తిరుపతి శ్రీ కోదండరామ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం స్వామి వారి రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 8.30 గంటలకు శ్రీ సీతా-లక్ష్మణ సమేత శ్రీ కోదండరాములవారు రథాన్ని అధిష్టించి నాలుగు మాడవీధుల్లో విహరించారు. భక్తుల రామనామ స్మరణతో తిరుపతి తిరువీధులు మార్మోగాయి. డప్పు వాయిద్యాలు, భజన బృందాలు కోలాటాలు ఆడుతుండగా భక్తులు భక్తి భావంతో రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ప్రబంధం, వేద శాత్తుమొర నిర్వహించి హారతి ఇచ్చారు. రథోత్సవానికి ప్రత్యేకమైన ఆధ్యాత్మిక తాత్పర్యం ఉంది. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీధులుగా భావిస్తారు. ఈ విధంగా శరీరాన్ని రథంతో పోల్చడం ద్వారా శరీరం వేరని, ఆత్మ భిన్నమని తెలియజేసే ఆత్మ-అనాత్మ వివేకం కలుగుతుంది. రథోత్సవం ద్వారా భక్తులకు ఈ తత్త్వజ్ఞానం తెలియజేయబడుతుంది.మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అర్చకులు తిరుమంజనం, ఆస్థానం నిర్వహించారు. రాత్రి 7 గంటల నుండి 8.30 గంటల వరకు అశ్వవాహన సేవ వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, టిటిడి బోర్డు సభ్యుడు జి. భానుప్రకాశ్ రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ సురేష్, ఇంజినీరింగ్ అధికారులు భక్తులు పాల్గొన్నారు.

# కుప్పం ప్రజల్ని సిఎం చంద్రబాబు మరువరు.. అభివృద్ధి ఆగదు

### - ప్రజల సమస్యలు తీర్చేందుకే పర్యటన.. కుప్పం ప్రజల్ని కలవడం నా కర్తవ్యం !! : సిఎం సతీమణి నారా భువనేశ్వరి



కూసూరులో మహిళలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి, హాజరైన మహిళలు

కుప్పం, మార్చి 24 ప్రభాతవార్త

ఎనిమిదిసార్లు తనను ఎమ్మెల్యేగా గెలిపించి నాలుగుసార్లు ముఖ్యమంత్రి చేసిన కుప్పం ప్రజలను సిఎం చంద్రబాబునాయుడు ఎన్నటికీ మరువరని సిఎం సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం కుప్పం మండలంలోని మంకల దొడ్డి, సింగారపురం, మోట్లచేను, కూసూరు, పైపాళ్యం గ్రామాల్లో మహిళలను, ప్రజలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలో కుప్పంలో అభివృద్ధి ఆగదని మరింత ముందడుగు వేస్తుందని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు తరపున ప్రతి గ్రామం తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని తీర్చేందుకే తాను పర్యటిస్తున్నట్లు స్పష్టం చేశారు. కుప్పం ప్రజలను కలవడం తన కర్తవ్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గానికి ఏమేమి అవసరం ఉన్నాయో వాటిని సిఎం చంద్రబాబు అందిస్తున్నారన్నారు. కుప్పం ప్రాంతంలో తాగు,సాగునీటి సమస్య ఉండడంతో సిఎం చంద్రబాబు శ్రీశైలం నుంచి కుప్పానికి హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా కృష్ణాజలాలు తెచ్చారని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. ఇక కుప్పానికి ఇప్పటికే 17 పరిశ్రమలు వచ్చాయన్నారు. దాదాపు 7203కోట్ల పెట్టుబడులతో కుప్పంలో పరిశ్రమలు ఏర్పాటవుతాయన్నారు. ఇందులో అడిడాస్ కంపెనీ ఉందన్నారు. కుప్పం ప్రాంత యువతకు ఏడాదిలో ఉద్యోగాలు లభిస్తాయని భరోసా ఇచ్చారు. ఇప్పటికే వన్ఎంవన్బి ద్వారా శిక్షణ ఇచ్చి ఎనిమిది జాబ్ మేళాలు సైతం నిర్వహించారన్నారు. అలాగే అలీప్ సంస్థ ద్వారా మహిళలకు శిక్షణ కల్పించడం జరుగుతోందన్నారు.కుప్పంలో ఇండస్ట్రియల్ పార్కులు సైతం ఏర్పాటుచేస్తున్నారన్నారు. కుప్పంలో అర్హులైన వారికి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో సిఎం చంద్రబాబు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. సమస్యలపై అర్జీలు ఇచ్చే వారి సంఖ్య తగ్గిందని ఇందుకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమమే కారణమని నారా భువనేశ్వరి పేర్కొన్నారు.

కుప్పంలో సంజీవని ప్రాజెక్టు ద్వారా పేదలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారన్నారు. గ్రామాలకు అవసరమైన రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు ఏర్పాటుచేయిస్తున్నారన్నారు. చెత్త నుంచి సంపద తయారీకై చర్యలు చేపట్టారన్నారు. గ్రామాలకు ఇ - ఆటోలు పంపిణీ చేశారన్నారు. కార్యక్రమాల్లో ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, టిడిపి జిల్లా అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి, టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, టిడిపి మండల అధ్యక్షుడు రాజ గోపాల్, జిల్లా అధికార ప్రతినిధి సాంబశివం, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, కార్పోరేషన్ డైరెక్టర్లు చెక్కునత్తం మణి, పార్థసారథి, శరవణ,కడ సభ్యులు రామచంద్ర, సుగుణమ్మ, తెలుగు యువత అధ్యక్షుడు కనకరాజ్, జనసేన ఇన్‌చార్జి నరేష్, నేతలు జెఎంసి మురళి, సింగపూర్ రవి, విభూషణ్, సికె మణి, సికె విజయ్, అశోక్,స్థానిక నేతలు పాల్గొన్నారు.

## కొత్త సిలబస్‌తో ఇంటర్ క్లాసులు

### ఆర్ఐఓ జి. రాజశేఖర రెడ్డి



తిరుపతి విద్య, మార్చి 24 ప్రభాతవార్త

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయని ఆర్ఐఓ జి. రాజశేఖర రెడ్డి తెలిపారు. ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియట్ విద్యా విధానంలో పలు విప్లవాత్మక మార్పులు చేపట్టి, సీబీఎస్ఈ నమూనాను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన సిలబస్‌కు అనుగుణంగా రూపొందించిన పాఠ్యపుస్తకాలు ఇప్పటికే మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇంటర్ బోర్డు ద్వారా వారం రోజులలోపు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.కొత్త సిలబస్ విద్యార్థుల్లో భావనాత్మక అవగాహనతో పాటు విశ్లేషణాత్మక ఆలోచనను పెంపొందించేలా రూపొందించబడిందని పేర్కొన్నారు. దీని ద్వారా పోటీ పరీక్షలకు విద్యార్థులు మరింత మెరుగైన సిద్ధత సాధించగలరని తెలిపారు. బోధన అందించేందుకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను మెరుగుపరచేందుకు ప్రత్యేక తరగతులు, మార్గదర్శక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, ప్రతి విద్యార్థి విద్యలో ముందుకు రావడానికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని ఆర్ఐఓ స్పష్టం చేశారు.

## ఎసిబి అధికారులపై దాడి

### - డాక్యుమెంట్ రైటర్‌తో పాటు మరొకరిపై కేసు నమోదు

*చిత్తూరు, మార్చి 24 ప్రభాతవార్త:*

*చిత్తూరు గిరింపేట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం-1పై సోమవారం దాడి చేయడానికి వెళ్ళిన అవినీతి నిరోధక శాఖ అధికారులపై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు ఎసిబి ఇన్స్‌పెక్టర్ ఎస్‌వి నరసింహారావు సోమవారం అర్థరాత్రి టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య కేసు నమోదు చేశారు. వివరాలిలా వున్నాయి. చిత్తూరు గిరింపేట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం-1లో భారీ అవినీతి జరుగుతుందని ఎసిబి అధికారులకు పలు ఫిర్యాదులు వెళ్ళాయి. ఈ మేరకు గిరింపేట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంపై సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎసిసి అధికారులు ముకుమ్మడిగా దాడి చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంపై ఎసిబి అధికారులు దాడి చేయడంతో అప్పటి వరకు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దందాలు నిర్వహిస్తున్న డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్లు పరారీ అయ్యారు. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం నుండి పారిపోతున్న ఓ వ్యక్తిని ఇద్దరు ఎసిబి కానిస్టేబుళ్ళు వెంబడించారు. ఆ వ్యక్తి రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలోని ఎస్ఆర్‌కె అసోసియేట్స్ కార్యాలయం వైపు పరిగెత్తడంతో ఎసిబి కానిస్టేబుళ్లు జయచంద్ర, రాజేష్, బాలజీలు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో సనంగి రామకృష్ణ, సనంగి సతీష్‌లు ఎసిబి కానిస్టేబు ఎసిబి కానిస్టేబుళ్ళు ధనంజయ్, లీలా ప్రసాద్‌లను చేతులతో కొడుతూ దాడి చేశారు. ఇది గమనించిన ఎసిబి ఇన్స్‌పెక్టర్ ఎస్‌వి నరసింహారావు సంఘటనా స్థలం చేరుకుని వాళ్ళని ఎందుకు కొడ్తున్నారు! వారు తిరుపతి ఎసిబి కానిస్టేబుళ్ళు! నేని ఎసిబి ఇన్స్‌పెక్టర్ ఎస్‌వి నరసింహారావు అని స్పష్టం చేశారు. అయితే ఎస్ఆర్‌కె అసోసియేట్స్ కార్యాలయంలో వున్న సనంగి రామకృష్ణ, సనంగి సతీష్‌లు తిరుగుబాటు ధోరణితో ఎసిబి వారైతే మాకేమి! ఇక్కడికి వచ్చి తనిఖీలు చేయడానికి మీకు వుండే అధికారం ఏంటీ! అంటూ పరుష పదజాలంతో విరుచుకుపడ్డారు. రామకృష్ణ ఆగ్రహంతో ఎసిబి కానిస్టేబుల్ తలపై కొడుతూ దాడికి పాల్పడగా, సనంగి సతీష్ ఇనుపరాడ్‌తో దాడికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో మరో ఎసిబి కానిస్టేబుల్ లీలా ప్రసాద్ అక్కడికి చేరుకుని వారిని ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించి తన గుర్తింపు కార్డును చూపించి పరిచయం చేసుకోవడానికి ప్రయత్నించగా సనంగి సతీష్ కానిస్టేబుల్ లీలా ప్రసాద్ గుర్తింపు కార్డు లాక్కొని వంచి పడేశాడు. దాడికి గురైన ఇద్దరు ఎసిబి కానిస్టేబుళ్ళు అక్కడి నుండి వెళ్ళి ఇతర సిబ్బందిని తీసుకురావడానికి ప్రయత్నించగా మరోసారి నిందితులు అడ్డుకున్నారు. మీరు ఎసిబి కానిస్టేబుళ్ళు అయితే మాకేంటీ! మా శక్తి చూపిస్తాం! ఇక్కడి నుండి ఎక్కడికి వెళ్తారు! అని మరోసారి దాడి చేశారు. ఈ మేరకు ఎసిబి ఇన్స్‌పెక్టర్ నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.*

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



చంద్రగిరి, మార్చి 24 ప్రభాతవార్త:

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి తొండవాడ సాయిబాబా ఆలయ సమీపంలో స్వర్ణముఖీ వంతెనపై చోటుచేసుకున్నది.. తొండవాడ గ్రామానికి చెందిన బాబు అనే వ్యక్తి ఈ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. బాబు రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. .బాబు తన సైకిల్‌పై వెళ్తుండగా, గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద దాటికి ఆయన ప్రయాణిస్తున్న సైకిల్ రోడ్డు పక్కన ఉన్న వాగు గుంతలో పడిపోయింది. గ్రామస్థుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు.

### రెండేళ్ళలో టిబీ కేసులు

## మరింత తగ్గించడమే లక్ష్యంగా విధులు

### - క్షయవ్యాధి పట్ల ప్రజల్లో మరింత అవగాహన: కలెక్టర్




చిత్తూరు, మార్చి 24 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లాలో రానున్న రెండు సంవత్సరాల్లో క్షయ కేసులు మరింత తగ్గించడమే లక్ష్యంగా వైద్యశాఖ విధులు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ క్షయవ్యాధిని కట్టడి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ మోడ్‌లో సమగ్ర చర్యలు చేపడుతున్నాయన్నారు. గతంలో పోల్చితే ప్రస్తుతం టిబి నిర్ధారణ సదుపాయాలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం, జిల్లా ఆసుపత్రిలో టిబి పరీక్షల సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ప్రస్తుతం ప్రతి నెల సుమారు 5 నుండి 6 వేల మందికి పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఈ పరీక్షలు సులభంగా వుండి కేవలం శ్లేష్మం(స్పుటం) నమూనా ఇస్తే ఒకటి రెండు గంటల్లోనే ఫలితాలు అందుబాటులోకి వస్తాయన్నారు. జిల్లాలో ప్రస్తుతం 2,500 నుండి 3 వేల వరకు యాక్టివ్ టిబి కేసులు వున్నాయని, ఈ రోగులకు ప్రతి నెల సమయానికి మందులు అందిస్తున్నామన్నారు. అలాగే సిఎస్ఆర్ సహకారంతో పోషకాహార కిట్లు అందిస్తున్నామన్నారు. అయితే ప్రజల్లో టిబి పట్ల అవగాహన తక్కువగా వుందని, ముఖ్యంగా 60 సంవత్సరాలు పైబడిన వారిలో టిబి గుర్తింపు రేటు తక్కువగా వుందన్నారు. జిల్లాలో ఈ ఏడాది టిబి పరీక్షలను 60 వేల నుండి 80 వేల వరకు పెంచే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లా, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యులు, నర్సింగ్ విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## మ్యుటేషన్, 22 ఏ, రీ-సర్వే, కోర్టు కేసులపై పరిష్కారం చూపాలి: కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్ మార్చి 24 ప్రభాతవార్త:. మ్యుటేషన్, రెవెన్యూ, 22 ఏ, రిసర్వే పి జి ఆర్ ఎస్, ఐ వి ఆర్ ఎస్ క్యాస్ట్ వెరిఫికేషన్, రైల్వే ప్రాజెక్టులు, భూసేకరణ, జాతీయ రహదారులు నిర్మాణ పనులు తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు లతో కలసి వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేసి త్వరతగతిన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్. వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ మిని కాన్ఫిరెన్స్ హాలు నందు వర్చువల్ గా జిల్లా లోని అందరూ ఆర్డీఓలు, తహసీల్దార్లు సంబంధిత అధికారులతో మ్యుటేషన్,22 ఏ, రీ-సర్వే, కోర్టు కేసులు, రెవెన్యూ, జి ఆర్ ఎస్, ఐ వి ఆర్ ఎస్, రైల్వే ప్రాజెక్టులు, భూసేకరణ, జాతీయ రహదారులు నిర్మాణ పనులు తదితర అంశాలపై దిశా నిర్దేశం చేస్తూ బాధ్యతాయుతంగా అందరూ కలసి సమన్వయముతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో లబ్దిదారులకు సంబంధించిన మ్యుటేషన్,22 ఏ, రీ-సర్వే రెవెన్యూ, ఇతర రెవెన్యూ సేవలు, జి ఆర్ ఎస్, ఐ వి ఆర్ ఎస్ క్యాస్ట్ వెరిఫికేషన్ తదితర అంశాలపై ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో జిల్లాలోని అందరూ ఆర్డీఓలు, తహసీల్దార్లు పూర్తిస్థాయిలో బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలవ్వాలంటే రెవెన్యూ అధికారుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరిగితే అది ప్రభుత్వంపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.మ్యుటేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని భూముల మ్యుటేషన్, పట్టాదారు పాస్‌బుక్ సవరణ, రికార్డుల నవీకరణ అంశాల్లో నిర్లక్ష్యం వహించకుండా నిర్ణీత గడువు లోపల పరిష్కారం చూపాలన్నారు. అలాగే పెండింగ్ మ్యుటేషన్ దరఖాస్తులను మండల స్థాయి లో ప్రత్యేకసమీక్షల ద్వారా



సమస్యల వలయంలో టిటిడి కళ్యాణమండపం

### అనుబంధ ఆలయాల ఆస్తులపై

## ఎందుకింత నిర్లక్ష్యం

### దేవస్థానం భూముల్లో రోడ్డు నిర్మిస్తుంటే టిటిడి ఏం చేస్తుంది? అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

**టిటిడికి అనుబంధంగా నిర్వహిస్తున్న శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి వందల కోట్లు విలువ చేసే ఆస్తుల్ని నాడు పరిపాలించిన తొండమాన్ చక్రవర్తి కేటాయించారు. ఇందుకు సంబంధించి పక్కా రికార్డులున్నాయి. అంతేకాక తొండమాన్‌పురం ఆలయం వద్ద టిటిడి ఉద్యోగుల్ని కకూడా నియమించింది. ఇక్కడ జరిగే ఉత్సవాలు ఇక్కడ నిర్వహిస్తారు. ఆ ఆస్తులను కాపాడాల్సిన టిటిడి ఎందుకో ఉదాసీన వైఖరిని అవలంభిస్తుంది. టిటిడి నిర్లక్ష్యం ఆక్రమణ దారులకు వరంగా మారింది.**

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి రూరల్)

శ్రీకాళహస్తి మండలం ఎగువ వీధి,దిగువ వీధి పంచాయతీలకు సమీపంలో శ్రీదేవి,భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయాన్ని తొండమాన్ చక్రవరి నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఈ రాజు ఆలయాన్ని నిర్మించటమే కాకుండా భవిష్యత్తులో ధూప దీప నైవేద్యాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా భూములను కేటాయించారు.అంతేకాక భవిష్యత్తులో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడకుండా ముందు జాగ్రత్తగా రెవెన్యూ రికార్డుల్లో కూడా నమోదు చేయించారు.ఇక్కడ ఆలయానికి కోట అంటారు. కోట చుట్లూ కోట గట్లు, అగర్తాలు ఏర్పాటు చేసారు.దీనికి సంబంధించి భూ వివరాలు కూడా పొందు పరచారు.నాడు కేటాయించిన భూములకు సంబంధించి పరిశీలిస్తే సర్వే నెంబర్ 164/3లో 3.58 సెంట్లు, 165/1లో 2.98 సెంట్లు 165/3లో 3.96 సెంట్లు కోట గట్టుగా 167/3లో 14.83 సెంట్లు అగర్తగా 154/1లో 6.5 ఎకరాలలో రెడ్డిగుంటగా కేటాయించి రికార్డులను రూపొందించి భద్రపరచారు.ఈ రికార్డులన్ని భద్రంగా ఉన్నాయి.పక్కాగా రికార్డులను పొందుపరచారు.

రికార్డులను తారు మారు చేస్తున్న అధికారులు:

ఈ రికార్డులన్ని రెవెన్యూ శాఖ వద్ద ఉన్నాయి.బహుశా టిటిడి వద్ద కూడా ఉంటాయి.అయితే ఇటీవల ఆలయానికి సమీపంలో వెనుక ఉన్న ప్రైవేటు వ్యక్తులు వేసిన వెంచర్‌లోకి పక్కాగా సిమెంటు రోడ్డు నిర్మిస్తుంటే ఇక్కడ పని చేస్తున్న టిటిడి ఉద్యోగులు ఏం చేస్తున్నట్లు? నెల నెలా జీతాలు తీసుకునే ఉద్యోగులకు స్వామి అస్తుల్ని కాపాడాల్సిన బాధ్యత లేదా? సిమెంటు రోడ్డు నిర్మాణం ఒక్కరోజులో అయ్యేది కాదు కదా? ఈ అంశానికి సంబంధించి ఇప్పటికే నాలుగు సార్లు జిల్లా కలెక్టర్ ప్రజా వేదికలో ఫిర్యాదులు చేసినా ఎందుకు దీని మీద చర్చ లేదు? పంచాయతీ సర్పంచ్ తీర్మానంతో 'దేవుని ఆస్తుల్ని విచ్చల విడిగా' రెవెన్యూ శాఖాధికారులు ధారాదత్తం చేయవచ్చా? దీని మీద రికార్డులు పరిశీలించాల్సిన అవసరం లేదా? అనే చర్చ చోటు చేసుకుంది.కొందరు రెవెన్యూ అధికారులు ఎస్ఎల్ఆర్,పేయిర్ అడంగళ్ళు,10(1)లతో పాటు అడంగళ్‌ను కూడా తారుమారు చేసినట్లు ఆరోపణలున్నాయి.మరి వీటి మీద రెవెన్యూ ఉన్నతాధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.ఇక ఆలయం సమీపంలో భూముల్లో పక్కాగా సిమెంటు రోడ్డు వేస్తుంటే అధికారులు ఎందుకు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వలేదు? అనేది చర్చనీయాంశంగా మారింది.

(రేపటి సంచికలో అభివృద్ధికి టిటిడి నిధులు)

## పులికాట్ సరిహద్దు వివాదాన్ని పరిష్కరించండి




సూళ్లూరుపేట, మార్చి 24 ప్రభాతవార్త

ఆంధ్రా, తమిళనాడు ప్రాంతంలో విస్తరించి ఉన్న పులికాట్ సరస్సులో సరిహద్దు వివాదంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ విషయమై ప్రభుత్వం స్పందించి తక్షణమే సరిహద్దు వివాదాలను పరిష్కరించాలంటూ మంగళవారం పులికాట్ పరిసర ప్రాంతాల్లోని మత్స్యకారులు పెద్దఎత్తున పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి బయలుదేరిన ర్యాలీ పట్టణంలో ప్రధాన వీధుల గుండా కొనసాగి ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ శరత్‌కు వినతిపత్రం అందజేశారు. గత 47 సంవత్సరాలుగా సరిహద్దు వివాదం యధాతథంగా ఉందని, ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని వాపోయారు. సింహభాగం పులికాట్ సరస్సు ఆంధ్ర రాష్ట్ర పరిధిలో ఉన్నప్పటికీ తమిళనాడు మత్స్యకారులు తరచూ వివాదాలకు దిగుతుండటంతో తమకు భద్రత లేకుండా పోయిందని వారు చెప్పారు. 1992లో సరిహద్దులు నిర్ణయించారని, కానీ ఆ సరిహద్దులో కాగితాలకే పరిమితమై ప్రస్తుతం అమలుకు నోచుకోలేదని చెప్పారు. ఇటీవల ఆంధ్రా, తమిళనాడు కలెక్టర్లు, ఎస్పీ, వివిధ శాఖల అధికారులు ఈ విషయమై శాంతి సమావేశాలు నిర్వహించినప్పటికీ అవి ఫలితాలివ్వలేదన్నారు. ప్రస్తుతం తమకు న్యాయం చేయని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని మత్స్యకార నాయకులు హెచ్చరించారు. ఈ సరిహద్దు వివాదంలో కేవలం ఆంధ్ర రాష్ట్ర మత్స్యకారులే నష్టపోతున్నారని, పులికాట్‌పై ఆధారపడి జీవించే వేలాది మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, ఈ విషయమై ప్రభుత్వం ఆలోచించి తగు చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ సందర్భంగా సీఐ మురళీకృష్ణ, ఎస్ఐలు అజయ్‌కుమార్, కొండప్పనాయుడు తదితరులు మత్స్యకారులతో చర్చలు జరిపి ర్యాలీని శాంతియుతంగా జరిగే విధంగా ఒప్పించారు.

# మార్చి నెలాఖరుకు కేంద్రీయ విద్యాలయం పనులు పూర్తి

**– ఇరువారంలోని కేంద్రీయ విద్యాయంను పరిశీలించిన కలెక్టర్**



**చిత్తూరు, మార్చి 24 ప్రభాతవార్త:** చిత్తూరు ఇరువారంలో ఏర్పాటు అవుతున్న కేంద్రీయ విద్యాలయం లో మౌళిక సదుపాయాలు, ఇతర పనులు మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఇరువారం కేంద్రీయ విద్యాలయం కోసం కేటాయించిన భవనంలో జరుగుతున్న పనులను కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ మార్చి నెలాఖరు నాటికి పనులు చేసి తరగతులు ప్రారంభించేలా భవనంను సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ భవనం లోపల, వెలుపల జరుగుతున్న పనులతో పాటు ఇంటర్నల్ రోడ్లు, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. పిల్లల ఆట స్థలంలో ప్లే ఎక్విప్‌మెంట్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఆపై తరగతి గదులు, మరుగుదొడ్లను కలెక్టర్ పరిశీలించారు. అలాగే తరగతి గదుల్లో ప్రత్యేక లైటింగ్, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, భవనం వెలుపల లైటింగ్ సామర్థ్యంను పెంచాలన్నారు. అనంతరం కలెక్టర్ కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థుల అడ్మిషన్లు జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యాలయంలో ఏ తరగతులకు అడ్మిషన్లు చేస్తున్నారు! అడ్మిషన్ల ప్రక్రియ ఎలా జరుగుతోంది! ఇప్పటి వరకు ఎంత మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు! అనే విషయాలను ప్రిన్సిపల్ రూథర్‌ను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మున్సిపల్ ఇంజనీర్ వెంకటరామిరెడ్డి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడనిదే ఏదీ రాదు ..హార్డ్‌వర్క్ చేయాలి : నారా భువనేశ్వరి

**కుప్పం, మార్చి 24 ప్రభాతవార్త**



విద్యార్థులకు కష్టపడనిదే ఏదీ రాదని విద్యార్థులు హార్డ్ వర్క్ చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం టి.సదుమూరు జడ్పీ హైస్కూల్‌ను నారా భువనమ్మ ఆకస్మిక ంగా సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పిల్లలు ఆంగ్లభాషపై అవగాహన ఎక్కువగా పెంచుకోవాలన్నారు. తద్వారా ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. బాగా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి. వికాస్ మర్మత్, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

## భూములసర్వేను అడ్డుకున్న రైతులు

**శాంతిపురం, మార్చి 24 ప్రభాతవార్త**



మండలంలోని ప్రీతిచామనూరు గ్రామం వద్ద పోచన్ కంపెనీకి ప్రభుత్వం కేటాయించిన 208 ఎకరాల భూమిని సర్వే చేసేందుకు వెళ్లిన కంపెనీ సిబ్బందిని రైతులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. వారి పరికరాలు తీసుకున్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ ప్రకాష్‌బాబు హుటాహుటిన గ్రామానికి వెళ్లి రైతులతో మాట్లాడి వారి పరికరాలు ఇప్పించారు. అయితే రైతులు తాము మాత్రం భూములు ఇచ్చేది లేదని సిఎం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

## ననియాల సమీపంలో జంట ఏనుగుల సంచారం

**రామకుప్పం, మార్చి 24 ప్రభాతవార్త**

మండలంలోని ననియాల సమీపంలో జంట ఏనుగులు సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. ననియాల, నారాయణపురం తాండా, పిఎంకె తాండా, గొల్లపల్లి, కావలిమడుగు, పంద్యాలమడుగు ప్రాంతాల వైపు ఏనుగులు వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏనుగుల సమాచారం తెలిస్తే వెంటనే ఎఫ్‌ఎస్‌ఓ 9441605505, ఎఫ్‌బిఓ 8074649347నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## పుల్లంపేటలో క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం

**పుల్లంపేట, మార్చి 24 ప్రభాతవార్త :**



ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అశ్విని చంద్ర మాట్లాడుతూ క్షయ వ్యాధిపై పకడ్బందీగా చర్యలు తీసుకుని వ్యాధి నిర్మూలనకై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించిన అనంతరం వ్యాధిని తుది ముట్టించేందుకు వైద్యుల సూచనలు సలహాలను పాటించాలని అశ్విని చంద్ర తెలిపారు. ప్రజలు కఫంతో కూడిన ఏడ తెరిపి లేని దగ్గు, రక్తం పడటం, జ్వరం అలసట నీరసం బరువు తగ్గి బలహీనంగా ఉండటం వంటి లక్షణాలు ఉన్నట్లయితే వారికి అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎండిటి ద్వారా సుమారు ఆరు నెలలు పాటు మందులు వాడినచో వ్యాధి పూర్తిగా నయం అవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మహేశ్వరమ్మ సుబ్బారెడ్డి మహేష్ ఏఎన్ఎంలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి : సిపిఐ



**పెనగలూరు, మార్చి 24 ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం ఎలక్షన్ సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ డిమాండ్ చేసింది. పెనగలూరు మండలంలో మండల సహాయ కార్యదర్శి ఈరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మండల తాసిల్దార్‌కి వినతిపత్రం అందజేచారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మండల పార్టీ కార్యదర్శి గానుగ పంట ఆదినారాయణ హాజరు కావడం జరిగింది. వారు మాట్లాడుతూ ఎలక్షన్ టైంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేర్చలేదని అన్నారు. వారు చెప్పిన మాటలు ఇంటి స్థలం లేక అలమటిస్తున్న నిరుపేదలైనటువంటి వారికి పట్టణాలలో రెండు సెంట్లు స్థలము గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం ఇచ్చి ప్రభుత్వమే హౌసింగ్ సాంక్షన్ చేసి ఆ ఇండ్లు కట్టుకోవడానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐగా మేము ఎన్నో దఫాలుగా ప్రభుత్వాన్ని కోరాము అన్నారు. వారి యొక్క కలలు ఇప్పటికీ కూడా నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా పేదవారి కలలు నిజం చేయాలని విజ్ఞప్తి చేస్తూ అర్హులైన నిరుపేదలకు వెంటనే ఇంటి పట్టాలు ఇచ్చి వారికి గృహ నిర్మాణానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు మండల కౌన్సిల్ సభ్యులు రేవూరు శంకరయ్య డిహెచ్పిఎస్ మండల కార్యదర్శి పందికాళ్ళ శివశంకర్ ఎస్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ రణభేరి 3.0 నిరాహార దీక్ష

**పూతలపట్టు, మార్చి 24, ప్రభాతవార్త**

పూతలపట్టు మండల పరిధిలో ఉన్న ఎంఈఓ కార్యాలయం ఎదురుగా నిరాహార దీక్ష ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పిలుపు మేరకు పూతలపట్టు నియోజకవర్గ స్థాయి యు.టి.యఫ్. రణభేరి 3.0 నిరాహార దీక్ష కార్యక్రమంలో చిత్తూరు జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు రెడ్డప్ప నాయుడు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం 12వ పిఆర్సి కమిటీని ఏర్పాటు చేయాలని, 29 ఐ.ఆర్. ప్రకటించాలని, గత 11వ పిఆర్సి బకాయిలు, 2018 నుంచి డిఎ బకాయిలు, 4 విడతల ప్రకటించాలని, సరెండర్ లీవ్ బకాయిలు వెంటనే మంజూరు చేయాలని, సిపిఎస్ విధానం రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని మినిమం టైమ్స్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా అధ్యక్షులు సదాశివ రెడ్డి, మాజీ అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు రాష్ట్ర కౌన్సిలర్ ఎస్పీ బాషా, జిల్లా కార్యదర్శి జిల్లా సిపిఎస్ కన్వీనర్ సుధాకర్, పూతలపట్టు మండల అధ్యక్షులు వడివేలు, ప్రధాన కార్యదర్శి యోగేశ్వర్ నాయుడు, సిపిఎస్ కన్వీనర్ గిరి, మహిళా ఉపాధ్యాయులు లతా, కళావతి, హేమలత, పూతలపట్టు నియోజకవర్గంలోని ఐరాల మండలం అధ్యక్షులు దేవరాజులు నాయుడు, ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, బంగారుపాళ్యం అధ్యక్షులు మహేష్ బాబు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, యాదమరి మండలం అధ్యక్షులు సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సర్దార్, తవణంపల్లి మండలం అధ్యక్షుడు రాజేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, సంఘ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు నుంచి గ్రామాల నీటి సమస్యలపై శిక్షణ కార్యక్రమం

**పూతలపట్టు, మార్చి 24, ప్రభాతవార్త**

పూతలపట్టు మండలంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆనంద రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేది బుధవారం ఉదయం 9:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగును మండల ప్రాదేశిక సభ్యులు సర్పంచులు వార్డు సభ్యులు వీలు కల్పించుకొని సదరు శిక్షణ కార్యక్రమమునకు హాజరుకావాల్సిందిగా కోరారు.

## పాఠశాల భవన గోడకు బీటలు

**పాలసముద్రం, మార్చి 24 ప్రభాతవార్త**



పాలసముద్రం మండలం శ్రీ బొమ్మరాజపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం మరమ్మతుకు గురికావడంతో ప్రభుత్వం గుర్తించి పాఠశాల భవన మరమ్మత్తు కోసం ప్రభుత్వం సుమారు 5 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసింది. దీని పసిగట్టిన అధికార పార్టీ పేరు చెప్పుకొని నాయకుడికి తక్కువ కార్యకర్తకి ఎక్కువ ఉండే ఒక వ్యక్తి పాఠశాల భవనం మరమ్మత్తు చేయడానికి ముందుకు వచ్చి తన చేతివాటం ప్రదర్శించి క్వారీలో నిరుపయోగంగా పడేసిన రాళ్ల పొడిని తెచ్చి భవన నిర్మాణానికి ఉపయోగించడంతో పాఠశాల భవనం పూర్తి కాక ముందే నాసిరకంగా నిర్మించడంతో నాణ్యత లోపించి గోడ బీటలు వారినది అని స్థానికులు వాపోతున్నారు. పాఠశాలలో ఉన్న చిన్నపిల్లల ను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పాఠశాల భవన మరమ్మతు చేయడానికి నిధులు కేటాయించిందని, కాంట్రాక్టర్ నిధులను స్వాహా చేయటానికి నాసిరకంగా పనిచేశాడని స్థానికులు అంటున్నారు. పాఠశాల పిల్లల ప్రాణాలతో చెలగాటం సరికాదని ఎలాంటి హాని జరగకముందే సంబంధిత జిల్లా స్థాయి అధికారులు భవనాన్ని పరిశీలించి భవనానికి వాడవలసిన ముడి పదార్థాలు తగు నిష్పత్తిలో ఉందో లేదో చూసి భవనంలోకి పిల్లలను పంపాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

## మాజీ ఎమ్మెల్యే సికె బాబును సన్మానించిన దేశం నాయకులు

**గుడిపాల, మార్చి 24 ప్రభాతవార్త:**

చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సికె బాబును గుడిపాల తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే సికె బాబు జన్మదినం పుస్కరించుకుని ఆయనను చిత్తూరులోని ఆయన నివాసంలో ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి ఆధ్వర్యంలో తెలుగుదేశం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు మాజీ ఎమ్మెల్యే సికె బాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు చల్లా మునిరత్నం యాదవ్, దొరబాబు యాదవ్, సురేష్ తదితరులు వున్నారు.

## సచివాలయాలకు యుపిఎస్‌లు పంపిణీ

**గుడిపాల, మార్చి 24 ప్రభాతవార్త:**

మండల పరిధిలోని 11 గ్రామ సచివాలయాలకు ప్రభుత్వ నిధులతో మంగళవారం ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి, మండల 'దేశం' అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, ఎంపిడిఓ గౌరీలు యుపిఎస్ పరికరాలను సచివాలయ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి, మండల దేశం అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడులు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి విద్యుత్ లేని సమయాల్లో సైతం సేవలు ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామ సచివాలయాలకు యుపిఎస్‌లు అందించిందన్నారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ మురళీ, సర్పంచ్‌లు, అధికారులు, దేశం నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ స్కూల్‌ను సందర్శించిన నారా భువనమ్మ



**కుప్పం, మార్చి 24 ప్రభాతవార్త**

మండలంలోని టి.సదుమూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సిఎం చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా అక్కడ ఉన్న పిల్లలతో ముచ్చటించారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం బయట ఉన్న పిల్లల తల్లులకు నుదుటన బొట్టుపెట్టి జాకెట్ వస్త్రం, పళ్లు అందించారు. పిల్లలను బాగా చదివించాలని నారా భువనమ్మ మహిళలకు సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి. వికాస్ మర్మత్ పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన నేతలు



**శాంతిపురం, మార్చి 24 ప్రభాతవార్త**

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో శాంతిపురంలో నూతనంగా నిర్మించిన అన్న క్యాంటీన్ భవనాన్ని స్థానిక నేతలు పరిశీలించారు. ఈనెల 26న సిఎం చంద్రబాబుసతీమణి నారా భువనేశ్వరి అన్న క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, సర్పంచ్ జనార్ధనరెడ్డి, నేతలు మణి, రాజు, చంద్ర, రుద్రప్ప, బాలకృష్ణ, లోకి, శివ, మంజునాథ్, అనసూయ, శ్యామలమ్మ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## క్షయ వ్యాధిపై అవగాహన

**బైరెడ్డిపల్లి, మార్చి 24 ప్రభాతవార్త**




ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా డాక్టర్.అరుణ్ కుమార్ హెచ్.ఎం. లక్ష్మి పతి ఆధ్వర్యంలో తీర్థం గ్రామంలో జెడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ పిల్లలచేత "మనందరి పంతం టీబీ అంతం "అను నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్. అరుణ్ కుమార్ మాట్లాడుతూ టీబీ వ్యాధి రాకుండా బిడ్డపుట్టినప్పుడు వెంటనే బిసిజి వ్యాక్సిన్ వేయించాలని రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం ఇలాంటి లక్షణాలు ఉన్నవారు దగ్గరలో ఉన్న ప్రభుత్వాసుపత్రి నందు గల్ల పరీక్ష చేయించుకోవాలని, ఈవ్యాధి వచ్చిన తర్వాత ఉచితంగా మందులు ఇవ్వడం జరుగు తుందన్నారు. అలాగే డై హెచ్.ఈ.ఓ.కాంతమ్మ మాట్లాడుతూ ఈ వ్యాధి ఉన్నవారు దగ్గినప్పుడు ఒకరి నుండి ఒకరికి నోటి తుంపర్ల ద్వారా వస్తుంది కాబట్టి దగ్గినప్పుడు చేతి రుమాలతో అడ్డు పెట్టు కోవాలి. అలాగే మంచి పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని, వడ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో పి. హెచ్. ఎన్ శమంతక, హెచ్. ఎస్. తిరుమలమ్మ, ఎస్.ఎన్. లక్ష్మి, ఆషా ,విద్యార్థులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికు చర్యలు

**రామకుప్పం, మార్చి 24ప్రభాతవార్త**



మండలంలోని బందార్లపల్లి పంచాయతీ గిడ్డపల్లి, పేరూరు గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడి ఉందని గ్రామస్తులు టిడిపి మాజీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి తెలియజేశారు. గురువారం ఆర్ డబ్ల్యు ఎస్,ఏఈలు హరి, విజయ్ సూచనలతో నూతన బావి మోటర్, పైపులు అమర్చి తాగునీటి సమస్య పరిష్కరించారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామానికి త్రాగునీటి ఎద్దడి రాకుండా తగు జాగ్రత్త తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, బాలసుబ్రమణ్యం, మురళీమోహన్, మనోహర్ , ఆనంద్ రామచంద్ర, కుమార్, చంద్రబాబు రెడ్డి, రామకృష్ణ, మహేష్ పంచాయతీ సెక్రెటరీ జ్యోతి పాల్గొన్నారు.

## టీబీ నిర్మూలన అవార్డును అందుకున్న తీర్థం వైద్యశాఖ

**బైరెడ్డిపల్లి, మార్చి 24 ప్రభాతువార్త**



బైరెడ్డిపల్లి మండలం తీర్థం పంచాయితీ పీహెచ్సీ ఉద్యోగులకు టీబీ నిర్మూలన అవార్డు దక్కినది. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా జిల్లా టిబి అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ అవార్డును అందించారు. టిబి జబ్బుకి ఉత్తమ సేవలు అందించినందుకు తీర్థం పిహెచ్‌సి పరిధిలో ఉన్న గడ్డూరు,వి హెచ్ సి, ఎం కొత్తూరు,ఉత్తమ టిబిరహిత గ్రామంగా ఎన్నికైనది. గ్రామ సర్పంచ్ రాజారెడ్డి , సి హెచ్ ఓ పూర్ణ, ఏ ఎన్ ఎం సుజాత అవార్డు అందుకున్నారు. పిహెచ్సి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## అవకతవకలు లేకుండా చూసుకుంటాం

### మార్కెట్ వ్యాపారుల సంఘం నేతలు



**వి.కోట, మార్చి 24 ప్రభాతవార్త:** వి.కోట మార్కెట్ యార్డ్ ప్రతిష్టకు భంగం కలిగేలా ప్రవర్తించిన పి ఎం ఎస్ మండి యజమాని శ్రీనివాస్ పై కఠిన చర్యలు తీసుకుంటామని వి. కోట మార్కెట్ వ్యాపార యూనియన్ నేతలు స్పష్టం చేశారు.మూడు రోజులుగా వి.కోట మార్కెట్ కమిటీ వ్యవహారంపై వస్తున్న వార్తలు విషయమై మంగళవారం యూనియన్ నాయకులు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు పిఎన్ నాగరాజు మాట్లాడుతూ పి ఎం ఎస్ ట్రేడర్ యజమాని మరో వ్యాపారి నాగరాజుపై దురుసుగా ప్రవర్తించడాన్ని యూనియన్ తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. ఆయన తీరు సంఘానికి సంబంధం లేదని తెలిపారు.సంఘం సభ్యుల సంక్షేమం కోసం ఏర్పాటు చేశామని సిండికేట్ కోసం కాదని తెలిపారు. మండి వ్యాపారులు ఎలాంటి అవకతవకలకు పాల్పడిన యూనియన్ దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుం టామన్నారు.మార్కెట్ యార్డ్ ప్రతిష్ట నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన కోరారు.

## మేడం ఇది మీకు తగునా?



**పూతలపట్టు, మార్చి 24, ప్రభాతవార్త** మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో యాదమరికీ రెగ్యులర్‌గా పూతలపట్టు మండలానికి ఇన్చార్జిగా ఉంటూ వ్యవహరిస్తున్న తీరు పూతలపట్టు మండల ఉపాధి హామీ కూలీల పాలిట శాపంగా మారింది. పూతలపట్టు మండలంలో నాయకుల పిలుపు లేనిదే ఆమె అడుగు కూడా ఇక్కడ పెట్టడం లేదు. ఇక ఉపాధి హామీ కూలీల పరిస్థితి దయనీయంగా మారింది. ఉపాధి పథకం కింద పనిచేస్తున్న చిన్న చిన్న బిల్లులు రాకపోవడం కొంతమంది పేరు మోసిన నాయకులు ఇదే ఉపాధి హామీ పథకం కింద మస్టర్లో కూలీలను పనిచేస్తున్నట్టు చూపించి జెసిబిలతో పని చేయించుకుని న్యాయ బద్ధంగా రావాలసిన ఆర్థిక నిధులను అడ్డదవ పట్టిస్తూ రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నది. ఆమె కూడా రైతులకు పని చేయకుండా లీడర్లకు మాత్రమే పనిచేస్తూ వారి ఫోన్లు మాత్రమే లిఫ్ట్ చేస్తూ రైతులు ఫోన్ చేస్తే కనీసం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న శైలి పూతలపట్టు మండలంలో ప్రధానంగా రైతులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్టు వారు వాపోతున్నారు. ఈ మండలానికి ఇన్చార్జి కాకుండా రెగ్యులర్‌గా అధికారులు వేయాలని, లేదా నాయకుల అండదండల కింద పనిచేయకుండా ఉపాధి హామీ కూలీలకు, మండల రైతాంగానికి ఉపయోగపడే విధంగా ఉండాలని రైతులు సర్వత్రా చర్చించుకోవడం వెలుగులోకి వచ్చింది.

## ట్రాక్టర్ డ్రైవర్‌కు రెండేళ్ళ జైలు

**చిత్తూరు, మార్చి 24 ప్రభాతవార్త:**

ట్రాక్టర్‌ను నిర్లక్ష్యంగా నడిపి ఓ విద్యార్థి మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ వి.గోవిందస్వామికి రెండేళ్ళ జైలు శిక్ష విధిస్తూ 3వ అదనపు ఎడిఎంఎం న్యాయమూర్తి బి.శిరీష మంగళవారం తీర్పు వెలువరించారు. గత ఏడాది నవంబర్ 16వ తేదీ చిత్తూరు బివి రెడ్డి పాఠశాలలో 2వ తరగతి చదువుతున్న జికెజై నిరూప్(7)ను అతని తల్లి ఎ.స్వప్న తన ద్విచక్రవాహనంలో వెనుక కూర్చోబెట్టుకుని ఇంటి నుండి స్కూల్‌కు వెళ్తుండగా మార్గమధ్యలోని ఫారెస్ట్ రోడ్డులో డీర్ పార్కు నుండి మెసానికల్ పార్కు వైపుకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ వెనుక కూర్చొని వస్తున్న నిరూప్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కోర్టులో నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగా ఈ మేరకు కేసు పూర్వ పరాలను విచారించిన కోర్టు ట్రాక్టర్ డ్రైవర్ వి.గోవిందస్వామికి రెండేళ్ళ జైలు శిక్ష, 3 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

# తిరుపతి డివిజన్

## అభివృద్ధి కూటమి పార్టీలతోనే

**-పనబాక,దివాకర్‌రెడ్డి**

తిరుపతి,మార్చి 24ప్రభాతవార్త: సంక్షేమ అభివృద్ధి జరగాలంటే ఒక కూటమి ప్రభుత్వమేనని టిడిపి పార్లమెంట్ అధ్యక్షురాలు,ప్రధాన కార్యదర్శి పనబాక లక్ష్మి, సి.దివాకర్‌రెడ్డి తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ కు దాదాపుగా 1.5కోట్లతో అనకాపల్లిలో శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. దాదాపుగా లక్షమందికి డైరెక్ట్‌గా ఇన్ డైరెక్ట్ గా ఉద్యోగ అవకాశాలు కల్పించేటువంటి విధానం నారా లోకేష్ పాదయాత్రలో ఏదైతే హామీలు ఇచ్చారన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానని దానిలో భాగంగానే నిన్న లక్ష ఉద్యోగాలు ఇవ్వటానికి సిద్ధమైందన్నారు. నూతన సంవత్సరం ఉగాది రోజున జాబ్ క్యాలెండర్‌తో నెల నెల జాబ్ క్యాలెండర్ గురించి వివరించారన్నారు. సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ 2045కు స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దాలని ధ్యేయంతో పనిచేస్తున్నారన్నారు. తిరుమలలో తిరుపతిలో భక్తులకు మనం ఇంకా ఎటువంటి సదుపాయాలు ఏర్పాట్లు చేయగలము, ఎలా ఉన్నాయి ఏంటి అనేటువంటి వాటి మీద పూర్తిగా మా దగ్గర ఆరా తీశారన్నారు. 2021 సెప్టెంబర్ 21న 300 రూపాయలు టికెట్లు దాదాపుగా 73,550, టికెట్లు అమ్మారు ఏ విధంగా అమ్మారని గత వైసిపిని ప్రశ్నించారు. ఎవరెవరు ఏం చేస్తున్నారో అవన్నీ మనకు తెలుసన్నారు.ప్రపంచమంతా తిరుపతి వైపు చూస్తుంటే అభివృద్ధి సంగతి పక్కనపెట్టి బురద చల్లేటువంటి వ్యవహారాన్ని భూమన నడిపిస్తున్నారని విమర్శించారు. తిరుమలను భగవంతుని అడ్డుపెట్టుకొని పాపాల మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. 2019 -2024 మధ్యకాలంలో వైవి సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి ముఖ్యమంత్రిని పిలిపించి బోర్డు మీటింగ్ ఎప్పుడన్నా మాట్లాడారా? కుటుంబ సభ్యులతో అన్నదానానికి వెళ్లి పదిమందికి భక్తులకు వడ్డించారా అని ఎద్దేవాచేశారు. పుట్టినరోజు వేడుకలకు కుటుంబ సమేతంగా తిరుమలకు వచ్చి డొనేట్ చేసి భక్తులతో మమేకమై అందరితో మాట్లాడుతున్నారన్నారు.

## ఆ బడి.. ఆనందాల ఒడి!

## మెరుగైన విద్యా ప్రమాణాలతో కెవిబి పురం పాఠశాల







కెవిబి పురం, మార్చి 24 ప్రభాతవార్త : అది కార్పొరేట్ పాఠశాల కాదు..పక్కా ప్రభుత్వ పాఠశాల కానీ అక్కడ విద్యార్థులు కార్పొరే ట్ స్థాయిలో విద్యను అందుకుంటున్నారు.అదే మండల కేంద్రమైన కేవీబీపురం నడి బొడ్డున ఉన్న మోడల్ ప్రాథమిక పాఠశాల. పచ్చని చెట్లతో పరి శుభ్రమైన అందమైన తరగతి గదులతో అనుభవం ఉత్సాహం, నిబద్ధత కలిగిన ఉపాధ్యాయులతో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా విద్యార్థుల సమగ్ర విద్యాపురోభివృద్ధి కి దోహదపడుతోంది. ఈ పాఠశాల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్య సంస్కరణలో భాగంగా 2025 26 విద్యా సంవత్సరంలో ఫౌండేషన్ పాఠశాలగా ఇద్దరు ఉపాధ్యాయులు 36 విద్యార్థులతో రెండు తరగతులు మాత్రమే ఉన్న పాఠశాలను ఐదు తరగతులు 87 మంది విద్యార్థులతో మోడల్ ప్రైమరీగా మార్చారు. బడి మన భవిష్యత్తు కార్యక్రమం ద్వారా పాఠశాలలో మోలిక వసతులు గణనీయంగా మెరుగుపడ్డాయి. విశాలమైన తరగతి గదులు వెలుతురు త్రాగునీటి వసతి సౌకర్యవంతమైన ఫర్నిచర్ పరిశుభ్రమైన తాగునీరు మరుగుదొడ్డి డిజిటల్ సౌకర్యం వంటి సదుపాయాలు అందుబాటులోకి రావడంతో విద్యార్థులలో అనుకూలమైన అభ్యసన వాతావరణం ఏర్పడింది. ప్రాథమిక స్థాయిలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడు విధానం సమర్ధవంతంగా అమలు జరుగుతున్నది. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి వ్యక్తిగత నేర్చుకునే సామర్థ్యాలు పెంపొందించే విధంగా పిల్లల్లో ఆసక్తితో పాటు ఆత్మవిశ్వాసం విద్యా వికాసాభివృద్ధి పెంచుతున్నారు.

## ఒంటి పూట పేరుతో డబుల్ గేమ్... స్కూల్స్‌పై తీవ్ర విమర్శలు

తిరుపతి విద్య మార్చి 24 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం వేసవి తీవ్రత దృష్ట్యా ఒంటి పూట బడులు నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, అనేక ప్రైవేట్ స్కూల్స్ వాటిని బేఖాతరు చేస్తున్నాయి. బయటకు మాత్రం"ఒంటి పూట" అని చెప్పుకుంటూ, లోపల రెండు పూటల తరగతులు నిర్వహించడం విద్యాశాఖ ఆదేశాలకు సవాల్‌గా మారింది."స్పెషల్ క్లాసులు" పేరుతో టెన్త్ విద్యార్థులను స్కూల్స్‌లోనే నిలిపి ఉంచుతూ సాధారణ తరగతుల్లానే బోధన కొనసాగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది విద్యార్థులపై అదనపు ఒత్తిడిని మోపడంతో పాటు తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించే చర్యగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.వేసవి ఎండలు మండిపోతున్న వేళ పిల్లల ఆరోగ్యం పట్ల పూర్తిగా నిరక్ష ్యం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తమవుతోంది. మధ్యాహ్నం వేళల్లో డీహైడ్రేషన్, అలసట, తలనొప్పి వంటి సమస్యలు ఎదురవుతున్నప్పటికీ స్కూల్ యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇదంతా అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపణలు ఉన్నాయి. ఫీల్డ్ స్థాయిలో తనిఖీలు లేకపోవడంతో స్కూల్స్ స్వేచ్ఛగా వ్యవహరిస్తున్నాయి. ఎలాంటి చర్యలు తీసుకోరనే ధైర్యంతో నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరిస్థితులపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. స్పష్టమైన పర్యవేక్షణ, కఠిన అమలు లేకపోతే"ఒంటి పూట" ఆదేశాలు కేవలం కాగితాలపైనే మిగిలిపోతాయని హెచ్చరిస్తున్నారు.

**ఆదేశాలు ఒకటే.. అమలు వేరేలా?:**

రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ స్పష్టంగా ఒంటి పూట బడులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థుల ఆరోగ్యం, వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే అనేక స్కూల్స్ ఈ ఆదేశాలను పూర్తిగా పట్టించుకోవడం లేదు. బయటికి మాత్రం"ఒంటి పూట" అని చెబుతూ లోపల మాత్రం రెండు పూటల క్లాసులు కొనసాగిస్తున్నారు. ఇది విద్యాశాఖపై నేరుగా అవమానం చేయడమే అవుతుంది. అధికారుల మాటకు విలువ లేకుండా వ్యవహరించడం చాలా దురదృష్టకరం. నియమాలు ఉన్నా, అమలు లేకపోతే అవి కాగితాలపైనే మిగిలిపోతాయి.

**"స్పెషల్ క్లాసులు" పేరిట మోసం:**

స్కూల్ యాజమాన్యాలు తమ చర్యలను సమర్థించుకోవడానికి"టెన్త్ క్లాస్ స్పెషల్ క్లాసులు" అని ఒక సాకును చూపుతున్నాయి. కానీ ఇది నిజంగా అవసరమా లేదా అనే ప్రశ్న తలెత్తుతోంది. పిల్లలపై అదనపు ఒత్తిడి పెడుతూ వారి విశ్రాంతిని దెబ్బతీస్తున్నారు. స్పెషల్ క్లాసులు అవసరమైతే కూడా అవి సమయానికి తగ్గట్టుగా ప్లాన్ చేయాలి. కానీ ఇక్కడ మాత్రం పూర్తిగా సాధారణ క్లాసుల్లానే కొనసాగిస్తున్నారు. ఇది విద్యార్థులపై అన్యాయం చేయడమే కాకుండా, తల్లిదండ్రులను కూడా తప్పుదోవ పట్టించడం. నిజానికి ఇది ఒక విధమైన వ్యవస్థీకృత మోసం.

**విద్యార్థుల ఆరోగ్యం ఎవరికి పట్టదా?:**

వేసవి వేడి రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో పిల్లల ఆరోగ్యం అత్యంత ముఖ్యమైన అంశం. ఒంటి పూట బడులు పెట్టడం వెనుక ప్రధాన ఉద్దేశం ఇదే. కానీ స్కూల్స్ మాత్రం తమ స్వార్థ ప్రయోజనాల కోసం పిల్లలను పూర్తిగా ఉపయోగించుకుంటున్నాయి. మధ్యాహ్నం తీవ్ర ఎండలో పిల్లలు అలసిపోతున్నారు. డీహైడ్రేషన్, తలనొప్పి, అలసట వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో చదువు మీద కూడా దృష్టి కేంద్రీకరించలేరు. విద్య అంటే కేవలం మార్కులు కాదు, పిల్లల శారీరక మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమే.

**అధికారుల నిరక్ష్యం.. యాజమాన్యాల ధైర్యం :**

ఈ పరిస్థితికి ప్రధాన కారణం అధికారుల నిరక్ష ్యం అని చెప్పాలి. డి ఈ ఓ ఇచ్చిన జి ఓ ను అమలు చేయించాల్సిన బాధ్యత వారి మీదే ఉంది. కానీ ఫీల్డ్‌లో తనిఖీలు లేకపోవడం వల్ల స్కూల్స్ స్వేచ్ఛగా వ్యవహరిస్తున్నాయి. ఎవరూ ప్రశ్నించరనే ధైర్యంతో యాజమాన్యాలు నియమాలను ఉల్లంఘిస్తున్నాయి. ఒకసారి కఠిన చర్యలు తీసుకుంటే ఈ సమస్య సులభంగా తగ్గిపోతుంది. కానీ ఇప్పటివరకు అలాంటి చర్యలు కనిపించడం లేదు. ఇది వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలను పెంచుతోంది. ఈ పరిస్థితులపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల భవిష్యత్తు పేరుతో ఇలాంటి ఒత్తిడి సరైనదా అని ప్రశ్నిస్తున్నారు.

## రోజా...నోరు అదుపులో పెట్టుకో : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి




శ్రీకాళహస్తి,మార్చి 24 ప్రభాతవార్త: వైకాపా నాయకులు విచ్చలవిడిగా తమ మీడియాలో ముఖ్య మంత్రి సతీమణి నారా భువనేశ్వరిదేవి, టిటిడి చైర్మెన్‌పై అవాక్కులు చెవాక్కులు పేలితే సహించేది లేదని శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ అభివృద్ధికి పాటు పడుతున్న తెలుగుదేశం నాయకులను భ్రష్టు పట్టించుటకు వైకాపా తమ సోషల్ మీడియాను వాడుకుంటుందని సుధీర్‌రెడ్డి శివమెత్తారు. తిరుమలకు సంబంధించి కల్తీ నెయ్యి, తలనీలాల కుంభకోణాలకు పాల్పడి తిరుమల పవిత్రతను మంట కలపిన వైకాపా బృందం తగుదనమ్మా అంటూ నేడు పారదర్శకతతో పరిపాలిస్తున్న టిటిడి చైర్మెన్‌పై అసత్య ప్రచారాలతో ధ్వజమెత్తడం దారుణమన్నారు. ఉగాదికి ముఖ్యమంత్రితో ఆమె సతీమణి భువనేశ్వరి పాల్గొనలేదని విమర్శిస్తున్న రోజా మళ్లీ నోరు పారేసుకుంటుందని ముఖ్యమంత్రి తమను అదుపులో పెడుతున్నారని లేదంటే ఎప్పుడో వారి విమర్శలకు సమాధానం చెప్పేవాళ్ళమన్నారు. ఐదేళ్ల వైకాపా పాలనలో సాగించిన కుంభకోణాల చిట్టా తన వద్ద ఉందని అవసరమైనపుడు ముఖ్యమంత్రి అనుమతిస్తే విప్పుతామని హెచ్చరించారు. ఉగాది పంచాంగ పఠనానికి ముఖ్యమంత్రితో సతీమణి రాలేదని చెబుతున్న వైకాపా నాయులు పవిత్రమైన టిటిడి బ్రహ్మోత్సవాల్లో ఎన్ని సార్లు ముఖ్యమంత్రితో ఆయన సతీమణి హాజరయ్యారో చెప్పాలన్నారు. తిరుమలను అపవిత్రం చేసిన వైకాపా ముఠాను వదలిపెట్టేది లేదన్నారు.ఈ మీడియా సమావేశంలో ఎంఎల్‌ఏతో పాటు పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.,విజయకుమార్‌నాయుడు, శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ చెంచయ్యనాయుడు, తొట్టంబేడు పార్టీ అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు, ధర్మకర్తల మండలి సభ్యుడుగోపి,తాటిపర్తి రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మకు విశేష పూజలు



శ్రీకాళహస్తిరూరల్,మార్చి 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో వెలసిన గ్రామ దేవతలు ఎల్లమ్మ, అంకమ్మ, పోలేరమ్మలకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. బుధవారం మహాకుంబాభిషేకం నిర్వహించుటకు సుమూహూర్తంగా నిర్ణయించినట్లు ఆలయ కమిటి అధ్యక్షులు జంగాల పల్లి తులసీరరామిరెడ్డి వివరించారు. మంగళవారం అమ్మవారికి విశేష రోజు కాబట్టి ఉదయం నుంచి ఆలయం వద్ద పూజల సందడి చోటు చేసుకుంది. గణపతి పూజలతో శ్రీకారం చుట్టారు. పుణ్యావాహచనం అంకురార్పణ పూజలు రెండో కాల యాగశాల పూజ పూర్ణాహుతి దీపారాధన,వేద పారాయణ సాయంత్రం గణపతి పూజలు మహాదీపారాధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధులుగా శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ,గ్రామానికి చెందిన పెద్దలు నీలకంఠారెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు రామిరెడ్డిలు పాల్గొన్నారు. వారికి ఆలయ కమిటి చైర్మెన్ తులసీరామిరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బుధవారం ఉదయం కన్నుల పండువగా కుంబాభిషేకం నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు.

## రామమందిరంలో మహాశాంతి అభిషేకం



శ్రీకాళహస్తిరూరల్,మార్చి 24 ప్రభాతవార్త: మండలంలోని ముచ్చివోలులో దేవాదాయశాఖ, గ్రామస్తుల భాగస్వామ్యంతో సుమారు రూ.2.5కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీరామమందిరం కుంబాభిషేకం కార్యక్రమాలు రెండు రోజులుగా సాగుతున్నాయి. బుధవారం ఉదయం ఆలయ మహాకుంబాభిషేకం నిర్వహించ నున్నారు.ఈ నేపధ్యంలో మంగళవారం ఉదయం నుంచి ఆలయంలో పూజల సందడి చోటు చేసుకుంది. ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. విష్వక్సేన పూజ,పుణ్యాహవాచకనం, అగ్ని ప్రణయనం, కుంబారాధన, ఉత్తహోమం, దాతాది,యర్దేవాది,మంత్రహోమం, లఘుపూర్ణాహుతి, బింబవాస్తు, నవ కలస స్నపనం, పంచగవ్యాది వాసం,క్షీరాధజ వాసం,చతుర్థశ కలశ మహాశాంతి అభిషేకం, ఆదివాసహోమం,హారతి అలాగే రాత్రి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ నరసింహారెడ్డి దంపతులు,వయ్యాల మనోహర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి,గుర్నాధంరెడ్డి, మురళీ మోహన్‌రెడ్డి, రామయ్య, వెంకటకృష్ణయ్య, కృష్ణయ్య, సుబ్బారావు,ఎర్రం నాయుడు,అమర్‌నాధ్‌రెడ్డి, నరసయ్య గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పి ఆదేశాలతో పోలీసుల రాత్రి గస్తీ



శ్రీకాళహస్తి,మార్చి 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పోలీసు సబ్‌డివిజన్‌లోని పోలీసులు డివైయస్‌పి నరసింహామూర్తి సారధ్యంలో మంగళవారం రాత్రి జిల్లా ఎస్పి ఆదేశాలతో నైట్ డామినేషన్ కార్యక్రమాలను నిర్వహించారు. డివిజన్‌లోని పోలీసులందరూ పట్టణంలో పెరెడ్ నిర్వహించారు.పెళ్లి మండపం వద్ద సమావేశం అయి నాలుగుమాడావీధుల్లో ప్రదర్శనలు జరిపారు. ప్రజల్ని అప్రమత్తం చేసారు. పోలీసులపై నమ్మకం, భద్రతా భావానికి నిదర్శనంగా ప్రజల్లో పోలీసులపై అవగాహణ కల్పించుటకు ఈ కార్యక్రమాలను నిర్వహించినట్లు డివైయస్‌పి నరసింహామూర్తి వివరించారు. ఇలాంటి పెరెడ్స్‌తో నేర కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసి విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయటానికి ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో డివైయస్‌పితో పాటు వన్‌టౌన్ సిఐ ప్రకాష్‌కుమార్, రూరల్ సిఐ ఇబ్రహీం, టూటౌన్ సిఐ నాగరాజు, బుచ్చినాయుడు కండ్రిగ సిఐ తిమయ్య వారి ఎస్‌ఐలు, ట్రాఫిక్ సిబ్బంది పోలీసులు పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితిల్లో ప్రజలు 112 నెంబర్‌కు డయల్ చేసి పోలీసుల సహాయాన్ని అందుకోవచ్చునని డివైయస్‌పి నరసింహామూర్తి వివరించారు.

## నిత్యం...దాడులతో భయభ్రాంతులు



శ్రీకాళహస్తి,మార్చి 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో తప్పిన యువత విచక్షణా రహితంగా దాడులకు పాల్పడుతున్నారు. వరుస సంఘటనలతో ప్రజలు భయభ్రాంతులౌతున్నారు. దీంతో శ్రీకాళహస్తిలో ఏం జరుగుతుందో అని ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా చోటు చేసుకున్న సంఘటనలతో యువత పూర్తిగా అదుపు తప్పుతున్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్న యువత మత్తులో ఏం చేస్తున్నారో అంతుపట్టని పరిస్థితి చోటు చేసుకుంది. మూడు రోజుల క్రితం ఓవర్ స్పిడ్ వెళుతున్న యువకులను ఎందుకిలా అన్నందుకు దాడి చేయటమే కాకుండా ఓ యువకుని కిడ్నాప్ చేసిన సంఘటన జనం మరువక ముందే, మళ్ళీ ఎన్‌టిఆర్ నగర్‌లో సోమవారం రాత్రి జరిగిన సంఘటన ఆందోళన కల్గిస్తుంది. ఎన్‌టిఆర్ నగర్‌లోని రత్నమ్మ అనే నడి వయస్కురాలు ఇంటి ముందు చెత్త ఊడుస్తుండగా ఆ మార్గాన ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకులు ఇంటి ముందున్న చెట్టుకొమ్మలను నరకగా ఎందుకని మందలించగా, ఇద్దరు యువకులు అదుపు తప్పి ఆ మహిళపై ఆమె భర్తపై చేయి చేసుకున్నట్లు సమాచారం. వారు అంతటితో ఆగక, తమ స్నేహితులను రప్పించారు. దాంతో చదువుకుంటున్న వర్షిత రెడ్డి అడ్డోచ్చాడని ఆతనిపై మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు.దాంతో తీవ్రంగా రక్త గాయాలతో వర్షితరెడ్డి శ్రీకాళహస్తి ప్రభుత్వాసుపత్రిలో చికిత్సకు చేరారు. మత్తులో యువకులు ఏం చేస్తున్నారో విచక్షణ మరచి వ్యవహారిస్తున్నారు.

## బకాయిల చెల్లింపుకు కమిషన్ ఏర్పాటు చేయాలి




శ్రీకాళహస్తి,మార్చి 24 ప్రభాతవార్త: రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ఇందుకు కమిషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం శ్రీకాళహస్తి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు మూకుమ్మడి దీక్షలు చేపట్టారు.ఈ ఆందోళనా కార్యక్రమాలను యుటిఎఫ్ చేపట్టింది. ఈ దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి జిల్లా కోశాధికారి మోహన్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిల చెల్లింపులకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎన్నో సార్లు ప్రభుత్వ దృష్టికి తెచ్చామన్నారు. అయితే ప్రభుత్వంలో స్పందన లేకపోవటంతో ఉపాధ్యాయులు యూటిఎఫ్ సారధ్యంలో రణభేరి 3.0 పేరిట ఒక్క రోజు ఆందోళనలో రిలే దీక్షలు చేపట్టామన్నారు.ప్రభుత్వం 11,12 పిఆర్‌సి బకాయిల మంజూరుకు జాప్యం చేస్తుందన్నారు. ఈ బకాయిల మంజూరుకు తక్షణం కమిషన్‌ను నియమించాలని డిమాండ్ చేసారు.ఈ అందోళన కార్యక్రమాలోన ఉపాధ్యాయులతో పాటు నాయకులు జిల్లా కార్యదర్శి వై.విజయశ్రీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.మధు, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు కెయస్‌బి సూర్య ప్రకాష్, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, దీపిక, భక్త వత్సలం,గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## లా కళాశాలల దందా బహిర్గతం... విద్యార్థుల నుంచి వేలల్లో అక్రమ వసూళ్లు



తిరుపతి విద్య మార్చి 24 ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలోని ప్రైవేట్ లా కళాశాలలు విద్యార్థులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.ఎన్.ఎస్.యూ.ఐ, వై.ఎస్.ఆర్.ఎస్. యూ, ఏ.పి.వి.హెచ్.ఎస్ నేతలు ఎస్.వి. యూనివర్సిటీ ఉపకులపతి టాటా నర్సింగరావుకు వినతిపత్రం సమర్పించి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థి నాయకులు వెల్లడించిన వివరాల ప్రకారం, యూనివర్సిటీ నిర్ణయించిన ఫీజులను బేఖాతరు చేస్తూ లా కళాశాలలు సెమిస్టర్ ఫీజుల పేరుతో రు.3000 నుంచి రు.3500 వరకు వసూలు చేస్తున్నాయి. "ఇంటర్నల్ ఎగ్జామ్స్" పేరుతో ప్రతి సబ్జెక్టుకు రు.1000 చొప్పున అదనంగా డబ్బులు తీసుకుంటూ విద్యార్థులను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.ఇంతటితో ఆగకుండా, వసూలు చేసిన ఫీజులకు రసీదులు ఇవ్వకపోవడం, ఫీజులు చెల్లించని విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా బెదిరించడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. కన్వీనర్ కోటలో సీట్లు పొందిన విద్యార్థుల నుంచే రెండింతల ఫీజులు వసూలు చేస్తూ పేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. ఖాళీ అయిన సీట్లను ఇతర రాష్ట్రాల విద్యార్థులతో భర్తీ చేసి లక్షల్లో అమ్ముకుంటున్నారని ఆరోపిస్తూ, గత ఐదేళ్ల అడ్మిషన్లపై విచారణ జరిపితే భారీ అక్రమాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. ఈ వ్యవహారం కొనసాగితే ఎస్.వి. యూనివర్సిటీ ప్రతిష్ట దెబ్బతింటుందని హెచ్చరించారు.ఈ నేపథ్యంలో ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసి, అక్రమంగా వసూలు చేసిన ఫీజులను వెంటనే తిరిగి చెల్లించాలనీ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

## టిబి రహిత సమాజమే మన లక్ష్యం : డాక్టర్ సుమలత



నింద్ర, మార్చి 24 ప్రభాతవార్త: ప్రపంచ టిబి దినోత్సవ ర్యాలీ నింద్రలో నిర్వహించారు.ఈ కార్యక్రమం పిహెచ్సి నుండి ప్రారంభమై పురవీధుల గుండా టిబి అంతం మనపంతం, టీబీ ఓడిపోతుంది దేశం గెలుస్తుంది, రెండు వారాలకు మించి దగ్గు టి బి కావచ్చు, టి బి వ్యాధి నిర్మూలన మన అందరి బాధ్యత, అంటూ స్లొగన్స్ చెప్పుకుంటూ బస్టాండ్ వరకు వెళ్లి మానవహారం నిర్వహించి, డిప్యూటీ హెచ్ఈఓ వి.గోపి, వారి చేత టీబీ రహిత సమాజానికి కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఈఓ వి.గోపి, సిహెచ్ఓ శ్రీదేవి, సురేష్ ఏఎన్ఎంస్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎన్నికల హామీలను నెరవేర్చండి...

## భూ సమస్యలను పరిష్కరించండి!




శ్రీకాళహస్తి,మార్చి 24 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు పేద ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, భూ సమస్యలను పరిష్కరించి పేదలను ఆదుకోవాలని సిపిఐ డిమాండ్ చేసారు. శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయం వద్ద దర్నా చేపట్టారు.ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువ నాయకుడు లోకేష్‌లు పాదయాత్రలు చేస్తూ ఎన్నో హామీలు ఇచ్చారన్నారు. ఇందులో ప్రదానంగా నిరుపేదలకు రెండు సెంట్లు భూములు, గ్రామాల్లో నిరుపేదలకు ఇళ్లు లేని వాళ్ళకు మూడు సెంట్లు భూములు వాగ్దానాన్ని నెరవేర్చాలన్నారు. అలోగే హౌసింగ్ రుణం రూ.ఐదులక్షలు ఇస్తామని ప్రకటించి మూడేళ్లు అయినా పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహశీల్దార్ సునీల్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమాలకు యూనియన్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కత్తి రవి, మండల నాయకుడురాజయ్య, పట్టణ నాయకులు మునెమ్మ, గంగమ్మ, మునిరాజా,మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యదక్షతకు మారు పేరు యువ నాయకుడు



శ్రీకాళహస్తి,మార్చి 24 ప్రభాతవార్త: పరిపాలనలో కార్యదక్షతకు మారుపేరుగా యువనాయకుడు నారా లోకేష్ పరిపాలన సాగిస్తున్నారని తెలుగుదేశం బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్‌రావు మరి కొందరు అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యాశాఖలో పెనుమార్పులతో సత్ఫలితాలను అందిస్తున్నారని వివరించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన వంటి కీలకమైన నిర్ణయాలు వేగంగా తీసుకుంటున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిశ దెశ నిర్దేశంలో లోకేష్ పెట్టుబడుల సాధనలో దేశంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రభాగాన నిలిపారని వివరించారు. ఎంతో పెద్ద ప్రాజక్టును నెలకొల్పటానికి అవసరమైన భూములిచ్చిన ంరైతులకు ప్రభుత్వం రుణ పడి ఉన్నారన్నారు. ఈ మీడియా సమావేశంలో కార్యదర్శి డాక్టర్ జి.దశరధాచ్చారి,మిన్నల్ రవి, డాక్టర్ యం.ఉమేష్‌రావు, బీమాల బాస్కర్ వజ్రం కిషోర్ కోట చంద్రశేఖర్ గంగనపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## హోం మంత్రి జన్మదిన వేడుకలు



శ్రీకాళహస్తి,మార్చి 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వెలగపూడి అనిత జన్మదిన వేడుకలను శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సారధ్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ కార్యకర్తలతో పాటు శ్రీకాళహస్తి పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు, తొట్టంబేడు మండల అధ్యక్షుడు రావిళ్ల మునిరాజా నాయుడు, మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు, నెమళ్ళూరుబుజ్జి, ధర్మకర్తల మండలి సభ్యుడు గోపి, తాటిపర్తి రవీంద్రనాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైన్‌షాప్ గుమాస్తా దురుసు ప్రవర్తన




తొట్టంబేడు,మార్చి 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండు వద్ద ఉన్న ఓ పెద్ద వైన్ షాపులో పని చేసే గుమాస్తా కస్టమర్లపై దురుసుగా ప్రవర్తిస్తున్నాడని కొనుగోలుదారులు వాపోతున్నారు.ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి కిక్ వైప్ షాప్‌లో మాన్‌సన్ మద్యం ఆర బాటిల్ తీసుకున్నారు. అయితే ఈ బాటిల్ మూత లీకేజ్ ఉందని ఫిర్యాదు చేయటంతో అక్కడ పని చేసే ఇద్దరు యువకులు కొనుగోలు దారులను వ్యంగంగా మాట్లాడుతూ లీక్ అయితే మాకెందుకు చెబుతారు? వెళ్ళి ఎక్సైజ్ శాఖ అధికారులకు పిర్యాదు చేయండి అంతేకాని ఇక్కడలొల్లి చేయవద్దంటూ హెచ్చరించారన్నారు. ఇక్కడ మద్యం కొనుగోలు చేసి ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదు చేయడమేమిటని కొనుగోలు దారులు అవాక్కయ్యారు.

## ద్వైత వేదాంతంలో పీహెచ్‌డీ సాధించిన పరిశోధకుడు

తిరుపతి విద్య, మార్చి 24 ప్రభాతవార్త



ద్వైత వేదాంత విభాగంలో శ్రీమద్ వ్యాసతీర్థ విరచిత శ్రీమన్న్యాయామృతే.. దృగ్దృశ్య సంబంధానుపపత్తి భంగ పర్యంతం కుండలగిరీయ రసకూలంకషా వ్యాఖ్యాయా పాఠసమీక్షాత్మక అధ్యయనం" అనే అంశంపై పరిశోధన చేసి బద్రీనాథ్ బెళ్ళారి పీహెచ్‌డీ (డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ) పట్టా పొందారు. ఈ పరిశోధనను ద్వైత వేదాంత విభాగ ఆచార్యులు ప్రొ. పి. నారాయణ్ మార్గదర్శకత్వంలో పూర్తి చేశారు. ఈ విషయాన్ని విశ్వవిద్యాలయం పరీక్షా నియంత్రకులు ప్రొ. రమాకాంత మిశ్ర ఒక ప్రకటనలో వెల్లడించారు. పీహెచ్‌డీ పట్టా సాధించిన బద్రీనాథ్ బెళ్ళారిని ఆయన పరిశోధన మార్గదర్శకులు ప్రొ. పి. నారాయణ్, ద్వైత వేదాంత విభాగ అధ్యాపకులు, విశ్వవిద్యాలయ విద్యార్థులు అభినందించారు.

## ఎంబీయూలో అక్రమ వసూళ్లు ఆపాలి: విద్యార్థి సంఘాలు

తిరుపతి విద్య, మార్చి 24 ప్రభాతవార్త



మోహన్ బాబు యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమ ఫీజుల వసూళ్లను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్యూలు కరపత్రాలు విడుదల చేశాయి. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద జరిగిన కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు. యూనివర్సిటీ యాజమాన్యం మెస్, ప్లేస్మెంట్ ట్రైనింగ్ పేర్లతో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ ఆర్థికంగా దోపిడీ చేస్తోందని ఆరోపించారు. ఫీజులు చెల్లించలేని విద్యార్థులను బెదిరించడం, చదువుకు ఆటంకాలు కలిగించడం జరుగుతోందని పేర్కొన్నారు. ఎ పి హెచ్ ఈ ఆర్ ఎమ్ సి నివేదికలో కూడా కోట్ల రూపాయల అక్రమ వసూళ్లు బయటపడ్డాయని, అయినా చర్యలు లేకపోవడం బాధాకరమని అన్నారు. అక్రమంగా వసూలు చేసిన ఫీజులను వెంటనే తిరిగి చెల్లించాలనీ, అవసరమైతే యూనివర్సిటీని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని విద్యార్థి సంఘాలు హెచ్చరించాయి వినయ్, వెంకటలక్ష్మీ త్రి, తేజ, మహేష్, రెడ్డి కుమార్, అనిత , ఎన్ ఎస్ యు ఐ జిల్లా నాయకులు కుమార్, యోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కుప్పం, మార్చి 24 ప్రభాతవార్త

మండలంలోని మోట్లచేనుకు చెందిన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ చక్రపాణి తెలిపారు. మోట్లచేనుకు చెందిన భూపతి (37) కుటుంబ కలహాల కారణంగా మంగళవారం గ్రామ సమీపంలో ఉన్న రాజప్పకు చెందిన మామిడితోటలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతదేహాన్నిపంచనామాకుతరలించికుటుంబీకులఫిర్యాదుమేరకుకేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## గ్రాంట్ వచ్చింది.. జీతం రాక ఉద్యోగుల ఆగ్రహం

తిరుపతి విద్య, మార్చి 24 ప్రభాతవార్త

ఎస్వీయూలో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉడికిపోతున్నారు. ప్రభుత్వం నుంచి రూ.18.50 కోట్ల అదనపు గ్రాంట్ మంజూరు అయిందని, జీవో వచ్చిందని హామీలు ఇచ్చినప్పటికీ వేతనాలు మాత్రం ఇంకా అందకపోవడంతో ఉద్యోగుల్లో ఆగ్రహం పెల్లుబికుతోంది. వారం రోజుల క్రితమే జీతాలు రాకపోవడంతో నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నిరసనలకు సిద్ధమవగా, అధికారులు చర్చలు జరిపి మంగళవారం జీతాలు పడతాయి" అంటూ హామీ ఇచ్చారు. ఆ మాట నమ్మి ఉద్యోగులు ఓపిక పట్టినా, చివరికి "జీవో వచ్చింది.. డబ్బులు మాత్రం రాలేదు" అనే సమాధానం వినాల్సి రావడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఇది కేవలం ఆలస్యం కాదు, ఉద్యోగులను తప్పుదోవ పట్టించిన చర్యగా అసోసియేషన్ నేతలు మండిపడుతున్నారు. హామీలు ఇచ్చి అమలు చేయకపోవడం అధికారుల వైఖరిపై తీవ్ర అనుమానాలు కలిగిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక మౌనం వీడాలని నిర్ణయించిన ఉద్యోగ సంఘాలు బుధవారం అధికారులను కలిసి తేల్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. సమస్య వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే సచివాలయ ముట్టడి

– యుటిఎఫ్ వార్నింగ్

పలమనేరు, మార్చి 24 ప్రభాతవార్త:

12వ పిఆర్‌సి అమలు, పెండింగ్ డిఎల విడుదల, ఆర్థిక బకాయిల సాధన కోసం రాష్ట్రంలోని అన్ని తాలుకా కేంద్రాల్లో ఒకరోజు నిరాహారదీక్ష నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ పేర్కొన్నారు. పలమనేరులో మంగళవారం రాష్ట్ర యుటిఎఫ్ కౌన్సిలర్ సిపి ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఒకరోజు నిరాహారదీక్షలో రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ పాల్గొని మాట్లాడుతూ రణభేరి 3.0 కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ నిరంకుశ వైఖరీని నిరసిస్తూ అన్ని తాలుకా కేంద్రాల్లో ఒక రోజు నిరాహారదీక్ష చేస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలం అయ్యిందన్నారు. ఎన్నికల ముందు కూటమి పెద్దలు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదన్నారు. 12వ పిఆర్‌సి గడువు ముగిసి మూడేళ్ళు అవుతున్నప్పటికీ పిఆర్‌సి అమలుకు ప్రయత్నించకపోవడం ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరీని తేటతెల్లం చేస్తోందన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో నియమించిన పిఆర్‌సి ఛైర్మన్ మన్మోహన్‌సింగ్ తన బాధ్యతలకు రాజీనామా చేసినప్పటికీ నూతన ఛైర్మన్ నియమించకపోవడం తగదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలు అమలు చేయడంతో పాటు ఆర్థిక బకాయిలను ఆరు నెలల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చి మూడేళ్ళవుతున్నప్పటికీ ఆ దిశగా సైతం ప్రభుత్వం ఆలోచించకపోవడం దారుణమన్నారు. ఈ దీక్షకు సంఘీభావంగా ఎన్జీఓ సంఘ నాయకులు హరి, రమణ, యుటిఎఫ్ డివిజన్ నాయకులు రయానంద, మంజులవాణి, సాలేహ, భాస్కర్, యుగంధర్, హరిప్రసాద్, ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, మోహన్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## దారి కల్పించండి

### రేణిగుంటకు చేరుకోవాలంటే 10 కిలోమీటర్లు చుట్టు తిరిగి ప్రయాణించాలిందే

రేణిగుంట, మార్చి 24 ప్రభాతవార్త



రేణిగుంట తిరుపతి మార్గ మధ్యంలో రేణిగుంట పాత చెక్‌పోస్ట్ వద్ద ఉన్న అండర్ బ్రిడ్జి ఏప్రిల్ 1 తేదీ నుండి మూసి వేస్తున్న విషయం పాఠకులకు విదితమే. కడప, నెల్లూరు వైపు నుండి అనేక గ్రామాలు పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు రేణిగుంటకు చేరుకోవాలంటే దాదాపు పది కిలోమీటర్లు రౌండ్ తిరిగి ప్రయాణించాల్సిన పరిస్థి తులు ఏర్పడనున్నాయి. అదేవిధంగా రేణిగుంట ప్రజలు వివిధ ఆసుపత్రులకు, దేవాలయాలకు, చర్చిలకు, చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లడానికి కూడా సుమారు 11 కిలోమీటర్లు చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన ఆవశ్యకత ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో రేణిగుంట కడప అనుసంధానంగా ఐదు కాణాల బ్రిడ్జి కింద నుండి జోహో వరకు బాట ఉండేది. ప్రస్తుతం ఆ మార్గం పూర్తిగా ముళ్ళకంపలు, చెత్తాచెదారంతో నిండి ఉంది. పంచాయితీ అధికారులు స్పందించి జెసిబితో ముళ్ళకంపలు, చెత్తను శుభ్రం చేసి తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని టిడిపి ఎస్సీ సెల్ మండల మాజీ కన్వీనర్ నెల్లూరు సుబ్రహ్మణ్యం అధికారులను కోరారు. దారి విషయంపై రేణిగుంట సర్పంచి నాగేషం, వైసిపి పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, టిడిపి మండల ఎస్సీ సెల్ మాజీ కన్వీనర్ నెల్లూరు సుబ్రహ్మణ్యం, పుర ప్రముఖుడు లోహి ఆ ప్రాంతాన్ని పరిశీలించి మార్గం ఏర్పాటుపై కార్యదర్శి రమేష్ తో చర్చిస్తామన్నారు. అధికారులు ముళ్ళకంపలు, చెత్తను తొలగించి దారిని ఏర్పాటు చేస్తే ఎంతోమందికి ప్రయాణం సుగమనం అవుతుంది.

## వేమూరులో దళితుల భూముల్లో మట్టి తవ్వకాలు

-చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్

తిరుపతిరూరల్, మార్చి24 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం వేమూరు రెవెన్యూ పరిధిలోని కస్తూరి కండ్రిక సమీపంలో దళితులకు కేటాయించిన భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపిన ఘటనపై సిపిఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సర్వే నెంబర్ 298/4లో వున్న 4.18ఎకరాలను దళితులకు ఇచ్చిన ఏక్‌సాల్ పట్టా భూముల్లో కాంట్రాక్టర్ మట్టి తవ్విరోడ్లకు తరలించారని ఆరోపించారు. సిపిఎం జిల్లా కార్యధర్శి వందవాసి నాగరాజు, జయచంద్ర, సుమన్ బాధితులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. దళితులను భూముల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటూ అగ్రవర్ణాలకు మాత్రం అనుమతి ఇవ్వడం అన్యాయమని ప్రశ్నించారు. గత 30 ఏళ్లుగా సాగులో ఉన్న దళితులకు రక్షణ కల్పించి, సాగుకు అనుమతి ఇవ్వాలని, అక్రమంగా మట్టి తవ్వినవారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ ఘటనలో బాధితులు చంద్రశేఖర్, బాబు, రామకృష్ణ, శివకుమార్ పాల్గొన్నారు.

## విజయపురంలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

విజయపురం,మార్చి 24 ప్రభాతవార్త:



మండల కేంద్రమైన విజయపురంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విజయపురంకు చెందిన చిన్నస్వామిరాజు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన తనయులు పుత్తూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రాజు, పుత్తూరు ట్రాన్స్‌కో ఏఈ భాస్కర్‌రాజులు తిరుపతి ప్రణవ మెగా థెరపీ వైద్యశాల ద్వారా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబు మాట్లాడుతూ ప్రతి జబ్బుకు మందులు అవసరం లేదని, కొన్ని జబ్బులు, యోగా ప్రణాయనం ద్వారా కూడా నయమవుతుందన్నారు. వైద్యులు రోహితాశ్రీ, ఆయుర్వేద, ఆక్యుపంచర్ గురించి వివరించి చికిత్స అందించారు. కార్యక్రమంలో వైద్యులు రేణుకాశ్రీ, వనజ, ఎంపీపీ లక్ష్మిపతిరాజు, చిత్తూరు పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనంజయయాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి మునిభాస్కర్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, నాయకులు ప్రవీణ్‌రాజు, రామచంద్రరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయాల ఉద్యోగులకు రక్షణ కల్పించాలి

..సిఐటియు డిమాండ్

తిరుపతి, మార్చి 24 ప్రభాతవార్త

తిరుపతి నగరంలో 25వ వార్డు సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి నాగార్జున యాదవ్ ఇంటి పన్నులు వసూలు చేయడానికి ప్రకాశం రోడ్‌లో ఉన్న సి.ఎన్ ప్రింటర్స్ ఓనర్ వసంత కుమార్ ఇంటికి వెళ్ళాడు. మూడు సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న 1,45,000 వేల రూపాయల పన్ను బకాయిలు కట్టమని అడిగినందుకు సచివాలయ ఉద్యోగి నాగార్జున యాదవ్ పై నలుగురు వ్యక్తులు తీవ్రంగా దాడి చేయడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండించింది. వెస్ట్ పోలీస్ స్టేషన్లో న్యాయం కోసం ఉన్న సచివాలయ ఉద్యోగి నాగార్జున యాదవ్ సిఐటియు నేతలు పరామర్శించారు. మీకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, సచివాలయ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. నాగార్జున యాదవ్‌కు న్యాయం జరగని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నాగార్జున యాదవ్‌ను సిఐటియు జిల్లా నేతలు టి సుబ్రమణ్యం, ఎస్. జయచంద్ర, టి రామకృష్ణ, కే వేణుగోపాల్, పి. బుజ్జి, ఆనంద్, నరేంద్ర ఉన్నారు.

## పుత్తూరులో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం

పుత్తూరు రూరల్, మార్చి 24 ప్రభాతవార్త:




ప్రపంచ క్షయ వ్యాధినివారణ దినోత్సవం సందర్భంగా పుత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో క్షయవ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి సమర్థవంతమైన చికిత్స అందించడం ద్వారా టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించి క్షయ వ్యాధి రహిత జిల్లాగా రూపొందించాలని డాక్టర్ సురేష్, సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రారంభమవుతున్న టీబీ ముక్త భారత్ అభియాన్-100 రోజుల కార్యక్రమం పై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ వంద రోజుల కార్యక్రమాన్ని జిల్లాలో మూడు దశలో అమలు చేయనున్నట్లు వివరించారు. టీబీ వ్యాధిని గల్ల పరీక్షల ద్వారా నిర్ధారించి మందులను అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలల్లో మందులు ఉచితంగా పొందవచ్చునని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

## ఏఐ-ఎంఎల్‌లో అవకాశాలు అపారం..

విద్యార్థులకు అవగాహన సెమినార్

తిరుపతి విద్య, మార్చి 24 ప్రభాతవార్త



శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), మెషీన్ లెర్నింగ్ (ఏఎల్), జనరేటివ్ ఎఐ, డేటా సైన్స్ రంగాల్లో కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించే సెమినార్ నిర్వహించారు. ఎక్సాఫ్లూయెన్స్ (యూఎస్ఎ) కంపెనీ ప్రతినిధులు, శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ సహకారంతో, కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. బి. సత్యనారాయణ మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు, మెషీన్ లెర్నింగ్ నేర్చుకోవడం ద్వారా ఆరోగ్యం, మొబైల్ టెక్నాలజీ, ఈకామర్స్, మార్కెటింగ్, విద్య వంటి అనేక రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తులో ఈ టెక్నాలజీలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్, డేటా సైన్స్ విభాగాధిపతి డా. పి. సృజన మాట్లాడుతూ, ప్రస్తుతం ఉపయోగిస్తున్న చాట్ జీపీటీ, పర్ప్లెక్సిటీ వంటి ప్లాట్‌ఫామ్‌లు జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేస్తున్నాయని వివరించారు. ఈ రంగంపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. ఎక్సాఫ్లూయెన్స్ కంపెనీ సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టి. విజయకుమార్ మాట్లాడుతూ, ఎఐ, ఏం ఎల్ వల్ల పనులు వేగంగా, కచ్చితంగా పూర్తవుతున్నాయని చెప్పారు. సెక్యూరిటీ, వ్యవసాయం, బ్యాంకింగ్, ఇండస్ట్రీ వంటి విభాగాల్లో ఎ ఐ వినియోగం పెరుగుతోందని తెలిపారు. అలాగే ఎక్సాఫ్లూయెన్స్ ఇన్స్ట్రక్టర్లు పి. స్వరూప్, పి.సుమంత్ మాట్లాడుతూ, ఎంఎస్ డేటా సైన్స్ రెండు సంవత్సరాల కోర్సు, డిప్లొమా కోర్సుల ద్వారా మంచి ఉపాధి అవకాశాలు, ఆకర్షణీయమైన జీతాలు లభిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డా. పి. సృజన, ఇంగ్లీష్ విభాగాధిపతి డా. పి.చంద్రయ్య, కామర్స్ అధ్యాపకురాలు పి. దివ్యతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డా. పి.సి. రాయులకు సన్మానం

తిరుపతి విద్య మార్చి 24 ప్రభాతవార్త



ప్రముఖ పారిశ్రామికవేత్త, గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ గౌరవ ఛైర్మన్ డాక్టర్ పి.సి. రాయులు ని భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ హిందీ సలహా కమిటీకి నామినేట్ చేసిన సందర్భంగా గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. తిరుపతిలోని ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఎంఆర్ భారతి, కార్యదర్శి కే విజయభాస్కర్ రెడ్డి, ట్రెజరర్ బండి మధుసూదన రెడ్డి, సభ్యులు శివన్న, షాబుద్దీన్, ఎన్ వెంకటేశ్వర్లు, ఎన్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొని పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, తిరుపతికి చెందిన డాక్టర్ పి.సి. రాయులు సామాన్య స్థితి నుండి ఉన్నత స్థాయికి ఎదగడం గర్వకారణమని పేర్కొన్నారు. డాక్టర్ పి.సి. రాయులు మాట్లాడుతూ, తనను సత్కరించిన సంఘ నాయకులు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

## అట్టహాసంగా ప్రారంభమైన శాప్ మాస్టర్స్ స్పోర్ట్స్ లీగ్స్ - 2026

తిరుపతి క్రీడ, మార్చి 24, ప్రభాతవార్త






తిరుపతి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి "శాప్ మాస్టర్స్ స్పోర్ట్స్ లీగ్స్ - 2026 పోటీలు 35+, 45+ సంవత్సరాల వయస్సు గల పురుషులు, మహిళలకు పోటీలు ఎస్వి యూనివర్సిటీ గ్రౌండ్‌లో మంగళవారం ఘనంగా ప్రారంభమైనాయి. ఈ టోర్నమెంటులో పురుషులు, మహిళల, శిక్షకులు, సిబ్బంది సుమారు 150 మంది పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నర్సింగ్ యాదవ్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం, అధ్యక్షురాలు సుశీల, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కోశాధికారి దేవరాజులు అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎన్ శశిధర్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్, నంబూరు, గుంటూరు జిల్లా మార్చి 30, 31వ తేదీలలో జిల్లాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ టోర్నమెంట్ ద్వారా జిల్లా స్థాయి ప్రతిభావంతులైన ఆటగాళ్లను గుర్తించి, వారి నైపుణ్యాలను మెరుగుపరచడం, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాము. ఇటువంటి కార్యక్రమాలతో క్రీడాకారులకు ఉత్సాహాన్ని పెంచుతూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యన్. శశిధర్ తెలిపారు.

## విద్యార్థుల ప్రాథమిక నైపుణ్యాల అంచనాకు జి.ఎఫ్.ఎల్.ఎన్ సర్వే ప్రారంభం

పాకాల, మార్చి 24, ప్రభాతవార్త



మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థుల కోసం గ్యారెంటీ ఫౌండేషన్ లిటరసి న్యూమరసి జి.ఎఫ్.ఎల్.ఎన్ సర్వేను మంగళవారం నుంచి ప్రారంభించినట్లు మండల విద్యాశాఖాధికారి బాబ్జి తెలిపారు. ఈ సందర్భంగా బందర్లాపల్లి బేసిక్ ప్రైమరీ పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ సర్వే నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ పరీక్షలో తెలుగు, ఇంగ్లీష్, గణితం అంశాలకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. పరీక్షను సి.ఆర్.పీలు, క్లస్టర్ టీచర్లు తమ లీప్ యాప్ లాగిన్ ద్వారా మాత్రమే నిర్వహిస్తున్నారని వివరించారు. ప్రశ్నలు పూర్తిగా ఆన్లైన్‌లో ఉంటాయని, విద్యార్థులు వాటిని చదివి మౌఖికంగా సమాధానం ఇవ్వగానే నమోదు చేయబడుతుందని చెప్పారు. ఈ సర్వే ముఖ్య ఉద్దేశ్యం ప్రతి విద్యార్థిలో చదవడం, అర్థం చేసుకోవడం, సొంత మాటల్లో భావాన్ని వ్యక్తపరచే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం అని బాబ్జి వెల్లడించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ, సి.ఆర్.పీ శ్రీనివా సులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల కోసం రూట్ మ్యాప్ ప్రకటించండి

– దీక్షలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాయుడు



***సత్యవేడు, మార్చి 24 ప్రభాతవార్త:*** ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిల చెల్లింపు కోసం ప్రభుత్వం వెంటనే రూట్‌మ్యాప్ ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్రకార్యదర్శి ఎస్.ఎస్.నాయుడు కోరారు. సమస్యల సాధన కోసం రణభేరి 3.0 ఆందోళనలో భాగంగా మంగళవారం సత్యవేడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నియోజకవర్గ స్థాయిలో యూటీఎఫ్ సంఘం ఉపాధ్యాయులు నిరాహారదీక్ష చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎస్.నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని వీడాలన్నారు. 29 శాతం ఐఆర్ వెంటనే ప్రకటించడంతో పాటు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 57 ప్రకారం 2004కు ముందఉ నియామకం అయిన వారందరికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కోవిడ్ సమయంలో మరణించిన 953 మంది పంచాయతీరాజ్ ఉపాధ్యాయ కుటుంబాలకు కారుణ్య నియామకాలు కల్పించాలన్నారు. హెల్త్ కార్డులు, మెడికల్ బిల్స్ వంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ తిరుపతి జిల్లా కార్యదర్శి సత్యవేడు ఇన్‌చార్జి వెంకటకృష్ణయ్య, రాష్ట్ర కౌన్సిలర్ ప్రభావతి, సత్యవేడు మండల యూటీఎఫ్ అధ్యక్షుడు త్యాగరాజు, గౌరవ అధ్యక్షుడు గురునాథం, పలువురు యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిని గుర్తిస్తే పూర్తిగా నయం చేస్తాం : వైద్యాధికారి



సత్యవేడు, మార్చి 24 ప్రభాతవార్త:

రోగిలో క్షయ వ్యాధిని సకాలంలో గుర్తిస్తే చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చునని సత్యవేడు మండలం దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి క్రిస్టల్ దాస్ తెలిపారు. మంగళవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో సర్పంచ్ మంజుల రమేష్ ఆధ్వర్యంలో క్షయవ్యాధి నిర్మూలనపై ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీవో చంద్రశేఖర్, పరిపాలన అధికారి త్రివిక్రమరావు, ఎంఈవో రవిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ క్రిస్టల్ దాస్ మాట్లాడుతూ రెండు వారాల కంటే అధికంగా దగ్గు కొనసాగినట్లయితే టీబీ లక్షణాలు ఉండే అవకాశాలు ఉందన్నారు. చర్మంపై ఒక చిన్న ఇంజెక్షన్ ఇచ్చి టీబీ స్కిన్ టెస్ట్ చేయించుకోవడం ద్వారా శరీరంలో టీబీ బ్యాక్టీరియా ఉందా అన్నది తెలుసుకునే అవకాశాలు ఉందన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ టీబీ వ్యాధి సంక్రమించి చికిత్స చేయించుకోవడం కన్న ముందస్తుగా నివారణ చర్యలపై దృష్టి సారించాలన్నారు. చేతులు తరచూ కడుక్కోవడం, శుభ్రమైన నీటిని తాగడం వంటి అలవాట్లు పాటించడం వల్ల టీబీని దూరం చేయవచ్చన్నారు. అంతకు ముందు పీహెచ్‌సీ వైద్యులు, ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల వైద్యులు, నరునసలతో కలసి ఆస్పత్రి ప్రాంగణంలో టీబీ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గాంధీ విగ్రహం వరకు ప్లే కార్డులు ప్రదర్శిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ వైద్యశాల వైద్యులు ప్రేమ, పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో సుబ్రహ్మణ్యం, పారఆ మెడికల్ స్టాఫ్ టీబీ యూనిట్ సిబ్బంది బాల, శివ, ఎల్.టి.ప్రకాష్‌పాల్గొన్నారు.

## శ్రీహరిపురం ఆదర్శ పాఠశాలను సందర్శించిన ఎంపీపీ



విజయపురం, మార్చి 24 ప్రభాతవార్త:

మండలంలోని శ్రీహరిపురం ఆదర్శ పాఠశాలను మంగళవారం ఎంపీపీ లక్ష్మిపతిరాజు సందర్శించారు. పాఠశాల కావలసిన మౌలికసదుపాయాలను పాఠశాలప్రధానోపాధ్యాయుడు వెంకమరాజు సమాజం ద్వారా సమకూర్చుకోవడం ఆనందంగా ఉందని ప్రశంసించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ సురేష్, ఉపాధ్యాయులు సూరలక్ష్మి, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని శ్రీహరిపురం - ఎస్టీ కాలనీ మార్గ మద్యలో నిర్మాణం జరుగుతున్న టీబీ రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయరామరాజు, చిన్నబ్బరాజు తదితరులు ఉన్నారు.

## రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే



దొరవారిసత్రం, మార్చి 24 ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యమని సూళ్లూరుపేట శాసన సభ్యురాలు నెలవల విజయశ్రీ స్పష్టం చేశారు. దొరవారిసత్రం మండలం వేణుంబాక గ్రామంలో మంగళవారం జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రైతులతో ముఖాముఖిగా మాట్లాడుతూ మార్చి 13న అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ మూడవ విడత నిధులు రైతుల ఖాతాల్లో జమ చేశారని, గత వైసిపి ప్రభుత్వం రైతులకు కేవలం 13,500 ఇస్తే, చంద్రబాబు నాయుడు ఆ సాయాన్ని రూ. 20వేలకు పెంచారని గుర్తుచేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న 26,526 మంది రైతులకు అదనంగా రూ. 17.24 కోట్ల లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే విజయశ్రీ వివరించారు. వేణుబాక గ్రామ ప్రజలు వారి ఊరు రోడ్డు మార్గాన్ని బాగు చేయాలని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు ఎమ్మెల్యే విజయ్ శ్రీ స్పందిస్తూ 2.70 కోట్ల రూపాయలు మంజూరైన త్వరలోనే రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల మండల అధికారులు ఎమ్మార్వో శైలకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, ఏవో జ్యోతిర్మయి, ఏఈఓ గౌస్కర్, అధ్యక్షులు వేమసాని శ్రీనివాస నాయుడు, టిడిపి మైనార్టీ నాయకుడు షబీర్ భాష, ఇంటికుంట రత్నయ్య, మాజీ ఎంపీటీసీ ఉదయ్ కుమార్, మనోహర్ రెడ్డి, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు..

## డివైడర్ ఢీకొన్న ద్విచక్ర వాహనం - వ్యక్తికి గాయాలు

పెళ్లకూరు, మార్చి 24 ప్రభాతవార్త: చెంబేడు క్రాస్ రోడ్డు వద్ద నాయుడుపేట పూతలపట్టు జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం డివైడర్ ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం సమయంలో శ్రీకాళహస్తి నుంచి ద్విచక్ర వాహనంలో నాయుడుపేట వైపు వెళ్తున్న వినోద్ కుమార్(27) అనే వ్యక్తి అక్కగారిపేట సమీప ప్రాంతంలో జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీ కొనడంతో తీవ్ర ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో వ్యక్తి తలకు తీవ్రగాయాలు కాగా 1033 ఎన్‌హెచ్ఐ అంబులెన్స్ ద్వారా క్షత గాత్రున్ని శ్రీకాళహస్తిలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించడం జరిగింది. ప్రమాదంలో గాయపడిన వ్యక్తిది తొట్టంబేడు మండలం శ్రీ కృష్ణాపురంగా తెలుస్తుంది.

## పెళ్లకూరులో క్షయ నియంత్రణ ర్యాలీ



పెళ్లకూరు, మార్చి 24 ప్రభాత వార్త: పెళ్లకూరులో స్థానికంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మంగళవారం క్షయ వ్యాధి నియంత్రణపై వైద్య సిబ్బంది మరియు ఆశా వర్కర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం క్షయ వ్యాధిపట్ల ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ఆశా వర్కర్లతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుజాత మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 24వ తేదీన ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందని దీని ద్వారా క్షయవాది పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం వ్యాధి లక్షణాలను గుర్తించడం, వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు.

## ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించాలి



తడ, మార్చి 24 ప్రభాతవార్త: రైతులు రసాయన ఎరువులు పురుగు మందులు వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించాలని వ్యవసాయ రిటైర్డ్ ఏడిఏ రాజగోపాల్ రైతులకు తెలియజేశారు. మంగళవారం కాదలూరు రైతు సేవా కేంద్రం నందు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ రసాయన ఎరువులు అధిక మోతాదులో వాడడం వల్ల భూమి తన స్వభావాన్ని కోల్పోయి నిస్సారంగా తయారవుతుందని భూమిని సారవంతం చేసేందుకు పచ్చిరొట్టె ఎరువుగా నవధాన్యాలు చల్లి భూమిలో కలియ దున్నడం వల్ల భూమి సారవంతంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఏ డి ఏ కాంచన ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఇంచార్జ్ షబీనా, ఉద్యానవన శాఖ అధికారి శారద,తడ ఏవో కిరణ్ కుమార్ దొరవారి సత్రం ఏవో జ్యోతిర్మయి రైతులు పాల్గొన్నారు.

## క్షయ నియంత్రణపై ర్యాలీ



నాయుడుపేట, మార్చి 24 ప్రభాతవార్త : పట్టణంలో ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నాయుడుపేట క్షయ నియంత్రణ పర్యవేక్షకుడు బొమ్మన రమణయ్య అధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలను అది రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట సిహెచ్‌సి డాక్టర్ అమర్నాథ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి,డాక్టర్ హేమచంద్ర, డాక్టర్ ప్రవీణ్ కుమార్, పలువురు ఏఎన్ఎంలు, ఎంపిహెచ్ఏ లు, ఆశ వాలంటేర్లు, వైద్యశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమ్మేళనంలో సీనియర్ జర్నలిస్ట్ నన్నూరుకు సన్మానం



నాయుడుపేట, మార్చి 24 ప్రభాతవార్త : వెంకటాచలం మండలం, ఎర్రగుంట వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో నిర్వహించిన జాతీయ స్థాయి శతాధిక కవి సమ్మేళనంలో సీనియర్ జర్నలిస్ట్, కవి నన్నూరు శ్రీనివాసరావు ఆ సంస్థ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన కవులు, కళాకారులు, రచయితలు పాల్గొన్ని తమ కవితా గానాలను వినిపించారు. శ్రీనివాసరావుకు కవిత్వంకు ప్రసంశలు రావడంపై పలువురు జర్నలిస్టులు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

## నిరుపేదల ముంగిట్లోకి వైద్య సేవలు



వాకాడు, మార్చి 24 ప్రభాతవార్త: కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన ఎం వి రావు ఫౌండేషన్ వారి వైద్య సేవలు కార్పొరేట్ స్థాయిలో ప్రతి గ్రామంలో నిరుపేదల ముంగిట్లోకి చేరబోయే రోజు దగ్గరలోనే ఉందని సర్పంచుల సంఘం అధ్యక్షులు, కల్లూరు సర్పంచ్ దువ్వూరు భాస్కర్‌రెడ్డి అన్నారు. వాకాడు మండలం కల్లూరు పంచాయతీ పరిధిలోని సిద్ధిగుంటపాలెం గ్రామంలో అంగన్వాడీ కేంద్రం వద్ద కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన ఎం వి రావు ఫౌండేషన్ నిర్వాహకులు మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం, హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంవి రావు, ఫౌండేషన్ చైర్మన్ లీల మోహన్ కృష్ణ, కార్యదర్శి విజయలక్ష్మి, బిజెపి నాయకులు వాకాటి సంపత్ కుమార్, విశ్రాంతి ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, ముని భాస్కర్, అంగన్వాడి ఉపాధ్యాయుని శైలజ, డాక్టర్ రమేష్, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిరసన



వెంకటగిరి, మార్చి 24 ప్రభాతవార్త: రాష్ట్ర శాఖ పిలుపుమేరకు యుటిఎఫ్ ఉపాధ్యాయులు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు చేశారు. డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. పిఆర్సి కమిషన్ వెంటనే నియమించాలని, 2.29 ఐఆర్ వెంటనే ప్రకటించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, హెల్త్ కార్డు సమస్యలు పరిష్కరించాలని, కోవిడ్ సమయంలో చనిపోయిన ఉద్యోగులకు కారుణ్య నియామకాలు చేపట్టాలిని, నాలుగు డిఎలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని తదితర డిమాండ్ల సాధన కోసం నిరసన చేశారు. మంగళవారం వెంకటగిరి నియోజక వర్గంలో జరిగిన యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన నిరాహార దీక్షలో జిల్లా సహాధ్యక్షులు కుమారస్వామి, జిల్లా కార్యదర్శి ఆదినారాయణ, వెంకటగిరి మండల అధ్యక్షులు సోమశేఖర్ రావు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, డక్కిలి అధ్యక్షులు గంగారావు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, బాలాయపల్లి మండల అధ్యక్షులు సరస్వతి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి విజయకుమార్, రిటైర్ ఉపాధ్యాయులు రాధాకృష్ణా రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు ఉదయ్ కుమార్, మూడు మండలాల ఉపాధ్యాయులు, మహిళా టీచర్స్, రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సమస్యను వెంటనే పరిష్కరించాలి : ఎంపీ

వెంకటగిరి, మార్చి 24 ప్రభాతవార్త : పార్లమెంట్ పరిధిలోని పులికాట్ సరస్సులో సుమారు 20 వేల మంది సంప్రదాయ మత్స్యకారులు గత రెండు దశాబ్దాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి లోక్‌సభలో ప్రస్తావించారు. రిజర్వ్ చేసిన మత్స్యకార ప్రాంతాల్లో పెద్ద యాంత్రిక పడవలతో పొరుగు రాష్ట్రాల మత్స్యకారులు అక్రమంగా చొరబడి వలలు, పడవలకు నష్టం కలిగించడమే కాకుండా, దాడులకు పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్య ఇప్పటికీ పరిష్కారం కాకపోవడంతో మత్స్యకారుల జీవనోపాధికి, శాంతి భద్రతలకు తీవ్రమైన ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రశ్నకు కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సమాధానం ఇస్తూ, తీరప్రాంత జలాల్లో మత్స్యకార కార్యకలాపాల నియంత్రణ రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోనే ఉంటుందని తెలిపారు. తీరప్రాంతాల్లో మత్స్యకారుల భద్రతకు కేంద్రం ప్రత్యక్ష బాధ్యత తీసుకుని, శాశ్వత అంతర్రాష్ట్ర సమన్వయ వ్యవస్థను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## పరిశ్రమల స్థాపనకు గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ : ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్



పుత్తూరు, మార్చి 24 ప్రభాతవార్త : దేశంలోనే పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గమ్యస్థానంగా నిలిచిందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ తెలిపారు. అనకాపల్లి జిల్లా రాజయ్యపేటలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ శంకుస్థాపనే దీనికి నిదర్శనమని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 5465 ఎకరాల్లో రూ. 1.50 లక్షల కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ స్టీల్‌ప్లాంట్‌తో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్‌పై ఏర్పడిన నమ్మకం, విశ్వాసానికి మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఒక ప్రతీక అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జూమ్ కాల్‌తో ప్రారంభమై, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో కేవలం 11 నెలల్లోనే అన్ని అనుమతులు, 20 నెలల్లో భూసేకరణ పూర్తయి స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన జరిగిందని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బ్రాండ్ ఇమేజ్, విజన్‌కు లోకేష్ చొరవ తోడవడం వల్ల 20 నెలల్లోనే రాష్ట్రానికి రూ. 20.35 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. చంద్రబాబు, లోకేష్‌లు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీ రానున్న మూడేళ్లలో సాకారమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనతో పనిచేస్తుండడం వల్ల పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్‌ను తమ గమ్యస్థానంగా మార్చుకున్నారని తెలిపారు. జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టిస్తూనే వుందన్నారు. వైసిపి తన తీరు మార్చుకుని అభివృద్ధికి సహకరించకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హితవు పలికారు.

## పుస్తకాలకే కాదు...
## నాణేలతో చరిత్రను తెలుసుకోండి: వెంకయ్య చౌదరి

**ఘనంగా ఎస్.వి. ఆర్ట్స్‌లో నాణేముల అధ్యయన వార్షికోత్సవం**



తిరుపతి విద్య, మార్చి 24 ప్రభాతవార్త: తిరుపతిలోని ఎస్.వి. ఆర్ట్స్ కళాశాలలో నాణేముల అధ్యయన సంస్థ 34వ వార్షికోత్సవ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీటీడీ అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వెంకయ్య చౌదరి మాట్లాడుతూ, పుస్తకాలకే పరిమితం కాకుండా నాణేల ద్వారా కూడా చరిత్రను తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. నాణేలు కేవలం లావాదేవీల సాధనమే కాకుండా దేశ చరిత్ర, సంస్కృతి, ఆర్థిక వ్యవస్థను ప్రతిబింబించే కీలక ఆధారాలని తెలిపారు. ప్రతి నాణెం ఒక కాలానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక పరిస్థితులను మాత్రమే కాకుండా, ఆ కాలపు పాలనా విధానం, వాణిజ్య సంబంధాలు, సాంస్కృతిక విలువలను కూడా స్పష్టంగా తెలియజేస్తుందని పేర్కొన్నారు. నుమిస్మాటిక్స్‌పై ఆసక్తి పెంచుకుని విద్యార్థులు పరిశోధనలు చేపట్టాలని సూచించారు.దేవస్థానం విద్యాశాఖాధికారి వెంకట సునీల్ మాట్లాడుతూ, నాణేముల అధ్యయనం విద్యార్థుల్లో విశ్లేషణాత్మక దృక్పథాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు చరిత్రపై లోతైన అవగాహన కల్పించడమే కాకుండా, పరిశోధనా మనోభావాన్ని పెంచుతాయని అన్నారు. ప్రాచీన నాణేలను అధ్యయనం చేయడం ద్వారా తార్కిక ఆలోచన పెంపొందుతుందని, పురావస్తు, చరిత్ర రంగాల్లో భవిష్యత్ అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని చెప్పారు.అలాగే శకుంతల, కిషన్, డా. ఎస్. వేంకటగోపాల్ రెడ్డి, భీమన్న, ప్రసాద్ రావు, సుబ్రహ్మణ్యం, లోకనాథ్, మండడి మల్లికార్జున్ రావు తదితరులు హాజరై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. వేంకటగోపాల్ రెడ్డి మాట్లాడుతూ,నాణేముల అధ్యయన సంస్థ గత మూడు దశాబ్దాలుగా విద్యార్థుల్లో చరిత్ర, పురావస్తు పట్ల ఆసక్తిని పెంపొందిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. సభలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పండితులు, అధ్యాపకులు తమ పరిశోధన పత్రాలను సమర్పించారు.ఈ కార్యక్రమంలో మ్యూజియం మాజీ కీపర్ వీరేందర్, హైదరాబాద్ నిమ్స్ మాజీ డైరెక్టర్ మరియు ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ రాజా రెడ్డి బి, మైసూరు నాణేముల అధ్యయన సంస్థ జనరల్ సెక్రటరీ ఆర్. గోపాల్, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా మైసూరు డైరెక్టర్ మునిరత్నం రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## ఎన్టీఆర్ కష్టపడి పైకి వచ్చారు...
## చంద్రబాబు నడిచి స్కూల్‌కు వెళ్లేవారు

**- విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేయాలి -ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్నాయి - సిఎం సతీమణి నారా భువనేశ్వరి**

కుప్పం, మార్చి 24 ప్రభాతవార్త : తెలుగువారి ఆత్మగౌరవం చాటిన దివంగత ఎన్టీఆర్ పేద కుటుంబంలో పుట్టి కష్టపడి ఉన్నతస్థాయికి వచ్చారని సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం పైపాళ్యం ప్రభుత్వపాఠశాల వద్ద ఏర్పాటుచేసిన అమ్మమాట కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆసక్తికర ప్రసంగం చేశారు. ఎన్టీఆర్ సైకిల్‌పై వెళ్లి పాలు విక్రయించి వీధి దీపాల కింద కూర్చుని చదివేవారన్నారు. అలాగే సిఎం చంద్రబాబునాయుడు చిన్నతనంలో నడిచి బడికి వెళ్లేవారని



పేర్కొన్నారు. వృత్తి రీత్యా ఎన్టీఆర్ బిజీగా ఉండడంతో అమ్మ తమతో అధిక సమయం గడిపేవారన్నారు. తమకు విలువల గురించి నేర్పించారన్నారు. పిల్లల ఎదుగుదలతో తల్లిపాత్ర ఎంతో కీలకమన్నారు. పిల్లలు అదేపనిగా సెల్‌ఫోన్లు వాడడం ప్రమాదకరమన్నారు. టెక్నాలజీని అవసరాలకు మాత్రమే వాడాలని సూచించారు. తమ చిన్నతనంలో టివిలు, ఫోన్లు ఉండకపోవడంతో తాము సంతోషంగా ఉండేవారమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ తల్లిదండ్రులకు గౌరవించాలని సూచించారు. సమాజంలో ఉమ్మడి కుటుంబాలు రానురాను కనుమరుగై మనుషుల మధ్య దూరం పెరుగుతోందన్నారు. తామంతా ఉమ్మడి కుటుంబంలో కలసిమెలసి ఉంటున్నామని పేర్కొన్నారు. తాను చదువుకునే సమయంలో మోరల్ సైన్స్ సబ్జెక్ట్ ఉండేదని అనంతరం తొలగించారన్నారు. ఈ సబ్జెక్టు మరలా సిలబస్‌లో పెట్టాలని మంత్రి నారా లోకేష్‌ను కోరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, విలువల బడి నిర్వాహకులు లెనిన్,స్థానిక నేతలు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## చేపల పడవల అక్రమ ప్రవేశాన్ని అరికట్టాలి

**- ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి**



వెంకటగిరి, మార్చి 24 ప్రభాతవార్త : జువలదిన్నె అర్బన్‌లో అక్రమ చేప పడవల ప్రవేశాన్ని అరికట్టాలని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి కోరారు. జిల్లా కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం నందు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో చేపల పడవల అక్రమ ప్రవేశం, తదనంతర పరిణామాలు మీద జిల్లా ఇంచార్జీ ఫరూక్, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర, జిల్లా మంత్రి వర్యులు ఆనం రామనారాయణ రెడ్డి మారిటైమ్ బోర్డు చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, వివిధ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. పలు సమస్యలను ఎమ్మెల్సీ మంత్రుల దృష్టి తీసుకెళ్లి వెళ్లారు.

## స్టీల్ ప్లాంట్‌తో హబ్‌గా మారనున్న ఏపి : ఎమ్మెల్యే



వెంకటగిరి, మార్చి 24 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌లో భారీ స్థాయి పరిశ్రమల అభివృద్ధికి కీలకంగా భావిస్తున్న ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం శంకుస్థాపన జరగడంతో ఇక ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో దూసుకుపోతుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ బాబు ల సమక్షంలో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ రాష్ట్ర పారిశ్రామిక వృద్ధికి కొత్త దిశను నిర్దేశించనుందని చెప్పారు. సుమారు రూ 1,35,964 కోట్ల అంచనా వ్యయంతో నిర్మితమవుతున్న ఈ ప్లాంట్ దేశంలోనే అతిపెద్ద సమగ్ర ఉక్కు తయారీ కేంద్రాలలో ఒకటిగా నిలవనుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా లక్షల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు ఏర్పడనున్నాయని అన్నారు. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని చెప్పారు. ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ కృషి, ప్రభుత్వ సమన్వయం, వేగవంతమైన నిర్ణయాల వల్ల ఈ ప్రాజెక్ట్ సాధ్యమైందని ఆయన పేర్కొంటున్నాయి. అంతర్జాతీయ స్థాయి కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఇది ప్రేరణగా మారుతుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా నిలబెట్టే దిశగా ఈ ప్రాజెక్ట్ మైలురాయిగా నిలవనుందని చెప్పారు.

## ఎన్టీఆర్ విగ్రహానికి రూ. 1.45 లక్షల విరాళాలు

బాలాయపల్లి, మార్చి 24 ప్రభాతవార్త: బాలాయపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి లక్షల 45 వేల రూపాయల విరాలాలు వచ్చినట్లు మండల పార్టీ అధ్యక్షులు రాయి సత్యం నాయుడు తెలిపారు. చుట్టి గ్రామానికి చెందిన గుండు బోయిన గోపాలయ్య, యాచవరం గ్రామానికి చెందిన వీరేపల్లి శివ పదివేల రూపాయలు వంతన సహాయం చేసినట్లు తెలిపారు. నిడిగల్లు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు 5000, అరిగిపల్లి గ్రామానికి చెందిన నక్కల గురవయ్య 20 వేల రూపాయలు, వెంగమాంబపురంకు చెందిన సోదులకుంట బాబునాయుడు 10,000 రూపాయలు, మన్నూరు గ్రామానికి చెందిన జలపల్లి కోటేశ్వరరావు 45 వేల రూపాయలు ఇచ్చినట్లు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి విరివిగా సహాయం చేయాలని కోరారు.

## 28న సామాజిక తనిఖీ నివేదిక వెల్లడి

బాలాయపల్లి, మార్చి 24 ప్రభాతవార్త: ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ నివేదిక ఈనెల 28వ తేదీ మండల పరిషత్ కార్యాలయంలో వెల్లడిస్తారని ఎంపీడీవో నారాయణ తెలిపారు. 1.4.2024 తేదీ నుండి 31వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీల తనిఖీలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. అందరూ ప్రజా ప్రతినిధులు, పిడి ఆధ్వర్యంలో నివేదిక వెల్లడిస్తారని ఎంపిడిఓ నారాయణ వివరించారు.

## సిఎస్ఆర్‌నిధులతో బాట్లింగ్ కంపెని వితరణ



శ్రీకాళహస్తి రూరల్,మార్చి 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలంలోని కోకా కోలా బాట్లింగ్ కంపెనీ సిఎస్ఆర్ నిధులతో పారిశుద్యానికి చేయూత నివ్వటం అభినందనీయం అని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అభినందించారు. మంగళవారం వారు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మండలంలోని చెర్లోపల్లి, తొండమనాడు, కాపుగున్నేరిలకు మూడు చెత్త సేకరణ ఆటోలను అందించారు. ఒక్కొక్కటి రూ.4లక్షల వ్యయంతో వెరసి రూ.12లక్షలతో అందించారు. ఈకార్యక్రమాల్లో ఎంఎల్ఏ మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పరిశ్రమలు సక్రమంగా సిఆర్ఎస్ నిధులు వినియోగిస్తే గ్రామాల్లో ఎంతో అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు.అయితే తొట్టంబేడు మండలంలో మంచినీటి సమస్య పరిష్కారానికి ఆ మండలంలోని పరిశ్రమల సహాకారం ఎంతో అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, రవీంద్రనాథ్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, కామేష్‌యాదవ్, కాసరం రమేష్, ముప్పాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి ఏర్పాట్లను పరిశీలించిన ఇఓ



శ్రీకాళహస్తి,మార్చి 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న నెహ్రూవీధిలోని శ్రీరామమందిరంలో ఈ నెల 27 నిర్వహించే 'సీతారాముల కళ్యాణం' ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి బికె కేశవులు తన సిబ్బంది పోలీసులతో కలసి పరిశీలించారు.మంగళవారం రాత్రి ఆయన ఏర్పాట్లును పరిశీలించారు. గతంలో ప్రసన్న వరదరాజస్వామి ఆలయం వద్ద ఓపెన్‌గా చలువ పందిళ్లు వేసి నిర్వహించే వారు. అయితే నెహ్రూవీధిలో కొత్తగా మందిరం నిర్మించిన తరువాత ఇక్కడే నిర్వహిస్తున్నారు. ఆలయ ఇఓ బికె వవెంకటేశులు భారీ ఎత్తున నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారు.ఇప్పటికే ఇక్కడ చక్కటి పందిళ్లు లైటింగ్ ఏర్పాటు చేసారు. మంగళవారం రాత్రి ఇఓ బికె వెంకటేశులు, సిఐ ప్రకాష్‌కుమార్‌లు పర్యటించారు. ఆయనతో పాటు సూపరింటెండెంట్ రవి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, ప్రదీప్ ఇంజనీరింగ్ శాఖకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రపంచ క్షయ వ్యాధి అవగాహన బారి ర్యాలీ

తిరుపతి హెల్త్, మార్చి 24 ప్రభాతవార్త: ఎస్వి వైద్య కళాశాల, రుయా ఆసుపత్రి ఫల్మనాలజీ విభాగం వారు ప్రపంచ క్షయ (టిబి)వ్యాధి నివారణ, అవగాహనతోనే నివారణ చేయగలమని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ క్షయవ్యాధి మైకోబాకటేరియం ట్యూబెర్క్లోసిస్ అనే బాక్టీరియా వలన వచ్చే వ్యాధి. క్షయవ్యాధి శ్వాసనాళానికి అనుసంధానమై ఉన్న మీ ఊపిరితిత్తులు క్షయ బాక్టీరియా సోకి, క్షయ వ్యాధికి గురవుతున్నాయి. ఈ ర్యాలీ సందర్భంగా తిరుపతి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ క్షయ (టీబి) వ్యాధిని కనుగొనవచ్చని వైద్యులు చెబుతున్నారు. క్షయవ్యాధిలో అత్యంత సాధారణ రకం పల్మనరీ (ఊపిరితిత్తు) క్షయ. కానీ ఈ బాక్టీరియా మీ శరీరంలోని ఇతర భాగాలను కూడా ప్రభావితం చేయగలదు (ఎక్స్ట్రా పల్మనరీ). ఇది శరీరం అంతటా వ్యాపించి టిబి వ్యాప్తి చెందేందుకు కారణమవుతుంది ఈ ర్యాలీలో ఆయన తెలిపారు. ప్రజల్లో సరైన అవగాహన కలిగి ప్రథమ దశలో టీవీ వ్యాధిని గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని సీమాంధ్ర పల్మనాలజీస్టుల అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రవి రాజు, రుయా పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ సుబ్బారావు ఈ సందర్భంగా తెలిపారు. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా డాక్టర్ రవి రాజు మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ క్షయ (టిబి) బాక్టీరియా సంక్రమణ వలన కలిగే ఒక వ్యాధి. అని ఆయన తెలిపారు. రుయా ఆసుపత్రి సూపరి టెండెంట్ డాక్టర్ జె.రాధ మాట్లాడుతూ ఈ క్షయ వ్యాధికి ప్రస్తుతం అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ర్యాలీని రుయా సూపరిటెండెంట్ డాక్టర్ జె.రాధా, జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ రవి రాజు, డాక్టర్ ఏఆర్ రెడ్డి, జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్. వి వైద్య కళాశాల సామాజిక వైద్య విద్య విభాగ పీజీ వైద్య విద్యార్థులు, పద్మావతమ్మ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, వైద్యులు, వైద్యాధికారులు, పీజీ వైద్య విద్యార్థులు, ఎస్ వి వైద్య కళాశాల పి.ఆర్ఓ. వీర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.